వసతులు సమకూరిస్తే చాలు...

కల్తీ గుట్టు విప్పేస్తుంది!

రూ. 10 కోట్లతో నిర్మించిన భవనాలు సిద్ధం | **ఇంతవరకు నామమాత్ర సేవలకే పరిమితం** | **ఐదేళ్లూ పట్టించుకోని వైకాపా సర్కారు**

వైకాపా పాలనలో చతికిలబడ్డ అనేక విభాగాల్లో గుంటూరులోని లాంఫామ్‌లో ఏర్పాటు చేసిన ఆహార పదార్థాల నాణ్యత ప్రయోగశాల ఒకటి..

ఉద్యాన విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో 2019 నాటికే రూ. 10 కోట్లతో భవనాల నిర్మాణం పూర్తయి.. అవసరమైన పరికరాలు సమకూరినా నాటి జగన్ ప్రభుత్వం నిధులివ్వలేదు. కనీసం నిర్వహణనూ పట్టించుకోలేదు. ఫలితం అది నామమాత్రపు పరీక్షలకే పరిమితమవ్వాల్సి వచ్చింది.

ఈనాడు - అమరావతి

వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటల ఉత్పత్తులతోపాటు ఆహార పదార్థాల నాణ్యత నిర్ధారించడానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఏర్పాటు చేసిన మొదటి ప్రయోగశాల ఇది. పూర్తిస్థాయిలో అందుబాటులోకొస్తే ఆహార పదార్థాలు, పానీయాల నాణ్యతను పరీక్షించే వెసులుబాటు కలుగుతుంది. తద్వారా రైతులతోపాటు వ్యాపారులు, ఎగుమతి కంపెనీలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. దీన్ని నేషనల్ అక్రిడిటేషన్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబొరేటరీస్ (ఎన్‌ఏబీఎల్) ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించారు.

రైతులకు ఉపయోగకరం

నాణ్యమైన ఆహార పదార్థాల ఎగుమతులను ప్రోత్సహించడానికి ప్రయోగశాల ఎంతగానో ఉపయోగపడుతుంది. కృష్ణా నుంచి మామిడికాయలు, గుంటూరు, కృష్ణా, అనంతపురం నుంచి కరివేపాకు పొడి, గుంటూరు నుంచి కారం పొడితో పాటు వివిధ ప్రాంతాల నుంచి తాజా కూరగాయలు, చేపలు, రొయ్యలు ఎక్కువగా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వీటిని ఇక్కడి ప్రయోగశాలలో పరీక్షించి, ధ్రువపత్రం పొందితే అంతర్జాతీయ మార్కెట్లో మంచి ధర పొందడానికి వెసులుబాటు కలుగుతుంది. దీని వల్ల రైతులకు గిట్టుబాటు ధర దక్కే అవకాశం ఉంటుంది.



ఉద్యానవర్సిటీ ఆధ్వర్యంలో లాంఫామ్‌లో నిర్మించిన ప్రయోగశాల భవనం

ఆర్థిక కష్టాలు తీరితేనే....

ప్రయోగశాల ఏర్పాటుకు కేంద్రం ఆర్‌కేవీవై కింద నిధులు మంజూరు చేసింది. గత వైకాపా ప్రభుత్వం కేంద్రానికి యూసీలు పంపకపోవడంతో నిధులాగిపోయాయి. ఈ ప్రభావం ప్రయోగశాల నిర్వహణపై పడింది. ప్రత్యేకంగా నిపుణులైన శాస్త్రవేత్తలు, సిబ్బందిని నియమించలేదు. ఉద్యాన వర్సిటీ పరిధిలోని శాస్త్రవేత్తలే నిర్వహణ చూస్తున్నారు. ప్రయోగశాలలో పని చేయాలంటే ప్రత్యేక శిక్షణతోపాటు ఆధునికంగా ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ పొందాల్సి ఉంటుంది. ఇవన్నీ పక్కాగా జరగాలంటే ప్రత్యేకంగా నిపుణులు, సిబ్బంది అవసరం. ఉద్యాన వర్సిటీ నుంచి ప్రతిపాదనలు వెళ్లినా గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లపాటు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసింది. ప్రయోగశాల నిర్వహణకు రసాయనాలు, గ్యాస్ వంటివి కొనుగోలు చేయడానికి సొమ్ము ఇవ్వలేదు. నిధులు, నిర్వహణ సిబ్బంది లేక ఐదేళ్లుగా నామమాత్రపు పరీక్షలకే పరిమితమైంది. ఈ విషయమై ఉద్యాన పరిశోధన కేంద్రం విభాగాధిపతి గిరిధర్ మాట్లాడుతూ నిధులు, సిబ్బంది నియామకం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. నిధుల విడుదలకు ప్రభుత్వం సుముఖం వ్యక్తం చేసిందని, త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు.


ప్రయోజనాలు ఎన్నెన్నో..

- అన్ని పదార్థాలు పరీక్షించి నాణ్యత ధ్రువపత్రాలిస్తారు. వీటి ఆధారంగా వ్యాపారులు వారి ఉత్పత్తులు విక్రయించుకోవచ్చు.
- పౌల్ట్రీ, డెయిరీ ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు, బిస్కెట్లు, బేకరీ ఉత్పత్తులు, తేనె, చక్కెరతో తయారైన పదార్థాలు, అన్ని రకాల కేకులు, చాక్లెట్లు, మద్యం, శీతలపానీయాలు, చిరుధాన్యాల ఉత్పత్తులు, వేరుశనగ, వాల్‌నట్స్, పచ్చళ్లు, చట్నీలు, గోరుచిక్కుడు, మొక్కలతో తయారైన ఔషధాలు, ఉద్యాన పంటల ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తుల నాణ్యత పరీక్షిస్తారు.
- పురుగుమందుల అవశేషాల్లేని ఆహార పదార్థాలను గుర్తించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.
- చేపలు, రొయ్యలు, సముద్ర ఉత్పత్తుల నిల్వ, రవాణాలో హానికరమైన రసాయనాల వినియోగాన్ని తెలుసుకోవచ్చు.
- చిరుధాన్యాలలో ప్రొటీన్లు, ఫైబర్, ఇతర ఖనిజాల శాతం ఎంతన్నది నిర్ధారించవచ్చు.
- భూమిలో భార ఖనిజాలు, నైట్రేట్లు, నీటిలో బ్యాక్టీరియా, ఫ్లోరైడ్ తదితరాలను గుర్తించొచ్చు.
- ఆహార పదార్థాల నాణ్యతతోపాటు పురుగుమందుల రసాయనాల అవశేషాల శాతాన్ని కూడా లెక్కిస్తారు.
- ఆహార పదార్థాల్లో బూజు, యాంటీబయోటిక్స్, వెటర్నరీ డ్రగ్స్ అవశేషాలను క్షుణ్ణంగా పరీక్షించే పరికరాలు ఇక్కడున్నాయి.

జలవనరులశాఖలో బదిలీలు

ఈనాడు-అమరావతి : జలవనరులశాఖలో పర్యవేక్షక ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా చిన్న నీటిపారుదలశాఖ కార్యనిర్వాహక ఇంజినీరు కల్లూరి రమేష్ పాడేరు నుంచి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన రమేష్‌ను వైకాపా ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధికి అనుకూలంగా చేయలేదనే కారణంతో పాడేరుకు బదిలీ చేశారు. తెనాలి కార్యనిర్వాహక ఇంజినీరు మల్లికార్జున కర్నూలు జిల్లాలోని శ్రీశైలం ప్రాజెక్టుకు వెళ్తున్నారు. రేపల్లె మురుగునీటిపారుదల విభాగంలో కార్యనిర్వాహక ఇంజినీరు వెంకటరత్నం కృష్ణా పశ్చిమ డెల్టాలో తెనాలి ఈఈగా వస్తున్నారు. విజయవాడ ముఖ్య ఇంజినీరు కార్యాలయం నుంచి శ్యాంప్రసాద్‌ను గుంటూరులోని గేజింగ్ డివిజన్ ఈఈగా బదిలీ చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో పనిచేస్తున్న శివరాంప్రసాద్ గుంటూరులోని పులిచింతల ప్రాజెక్టు డివిజన్-4కు బదిలీపై వస్తున్నారు.

ఆపద్బాంధవుడు



న్యూస్‌టుడే - మంగళగిరి, తాడేపల్లి, కొల్లిపర

భారీ వర్షాలు, వరదలకు సర్వం కోల్పోయారు. అటు రైతులు. . ఇటు చేనేత కార్మికులు తేరుకోలేనివిధంగా దెబ్బతిన్నారు. ఆపత్కాలంలో నేనున్నానంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శరవేగంగా నష్టం అంచనా వేయించారు. జాగు లేకుండా పరిహారాన్ని బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో దాదాపుగా 1400 మంది చేనేత కార్మికులు వరదల దెబ్బకు ఉపాధి కోల్పోయారు. మగ్గం గుంతల్లోకి నీరు చేరి దాదాపుగా 15 రోజులపాటు చేనేత మగ్గాలు పని చేయలేదు. స్పందించిన మంత్రి నారా లోకేశ్ యుద్ధప్రాతిపదికన నిత్యవసర సరుకులు, బియ్యం . చేనేత జౌళి శాఖ అధికారులు నష్టాన్ని లెక్కించి ప్రభుత్వానికి నివేదించారు. ఒక్కో కుటుంబానికి రూ. 25 వేల చొప్పున బాధితుల ఖాతాలకు జమ చేసింది.



మంగళగిరిలో చంద్రబాబు చిత్ర పటానికి చేనేత కార్మికుల క్షీరాభిషేకం

పక్షం రోజుల్లోనే వరద బాధితులకు పరిహారం

ఆపత్కాలంలో ఆదుకున్నారంటూ సంతోషం

- రోజుల వ్యవధిలోనే పంట నష్టపరిహారాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. పసుపు, అరటి, కందకు హెక్టారుకు రూ. 35 వేలు, కూరగాయల తోటలకు రూ. 25 వేల పరిహారాన్ని అందించింది. ఎకరా వరికి రూ. 10 వేలు జమ చేసింది.
- కొల్లిపర మండలంలో 2,401 మంది రైతులకు చెందిన 3,353 ఎకరాల్లో వరి, మినుము దెబ్బతినగా రూ. 3.85 కోట్ల పరిహారం అందింది.

కొల్లిపర మండలంలో 1,259 రైతులకు చెందిన 540 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. బాధితులకు రూ. 1.10 కోట్ల పరిహారం జమ చేసింది.

తెనాలి మండలంలో 188 మంది రైతులకు చెందిన 51 హెక్టార్లలో ఉద్యానపంటలు ధ్వంసమయ్యాయి. వీరికి రూ. 10 లక్షల పరిహారం అందింది.

కలలో కూడా ఊహించలేదు



వరద నష్టం వాటిల్లిన నెల రోజుల్లోపే ప్రభుత్వం పరిహారం ఇస్తుందని కలలో కూడా ఊహించలేదు. మగ్గం గుంతల్లోకి నీరు చేరి పని లేకుండా పోయింది. ఆ సమయంలో ఏం చేయాలో తోచలేదు. కుటుంబం మొత్తం నిరాశతో కూరుకుపోయిన సమయంలో మంత్రి నారా లోకేశ్ నిత్యావసరాలు పంపించారు. ఇప్పుడేమో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మా కుటుంబాలకు భరోసాగా నిలిచారు. పరిహారం ఇంత పెద్ద మొత్తంలో ఇస్తారనుకోలేదు. నా ఖాతాకు రూ. 25 వేలు జమయ్యాయి. ఎంతో ఆనందంగా ఉంది.

- కళ్యాణి, చేనేత కార్మికురాలు, మంగళగిరి

దళారుల ప్రమేయం లేకుండా..



వర్షాలు, వరదల కారణంగా చేనేత పనులు ఆగిపోయాయి. దెబ్బతిన్న మాకు ప్రభుత్వం నేరుగా పరిహారం అందజేసింది. దళారుల ప్రమేయం లేకుండా పరిహారం నేరుగా ఇవ్వడం బాగుంది. గతంలో ఈ విధంగా ఎన్నడూ చేయలేదు. మా కార్మిక కుటుంబాలన్నీ ప్రభుత్వానికి రుణపడి ఉంటాయి.

- చిన్ని కృష్ణ, చేనేత కార్మికుడు, మంగళగిరి

మనోధైర్యాన్నిచ్చారు



చేనేత కార్మిక కుటుంబాల ఖాతాలకు పరిహారం జమ చేసి మనోధైర్యాన్నిచ్చారు. ఎవరూ ఊహించని విధంగా నెలరోజుల్లోనే ఖాతాలకు రూ. 25 వేల చొప్పున జమ చేయడం ఎంతో ఆనందంగా ఉంది. గతంలో మమ్మల్ని పట్టించుకున్నవారే లేరు. మా అవసరాలను, నష్టాలను గమనించిన మంత్రి నారా లోకేశ్ సకాలంలో ఆదుకున్నారు. చేనేతకు జరిగిన నష్టానికి తగ్గట్టుగా పరిహారం ఇవ్వడం ఆనందంగా ఉంది. గతంలో ఎన్నో వరదలు వచ్చాయి. పరిహారం ఇదిగో.. అదిగో.. అనేవారు. కూటమి ప్రభుత్వం మమ్మల్ని ఆదుకున్నందుకు కృతజ్ఞతలు.

- పార్వతి, చేనేత కార్మికురాలు, మంగళగిరి

పెట్టుబడి సమకూరింది



వరద కారణంగా అరటి, పసుపు తోటలు పూర్తిగా నీట మునిగిపోయాయి. అపార నష్టం వాటిల్లింది. నా భార్య నగలు కుదువ పెట్టి పెట్టుబడి పెట్టా. ఆ అప్పు అలాగే ఉండిపోయింది. భూస్వాములు ముందస్తుగా కౌలు చెల్లించుకున్నారు. మొత్తం రూ. 3 లక్షల దాకా నష్టపోయా. ఈ తరుణంలో ప్రభుత్వం పరిహారం రూపంలో ఆదుకుంది. ఈ మొత్తం రెండో పంటకు పెట్టుబడిగా ఉపయోగపడుతుంది.

- తాతా వీరాంజనేయులు, రైతు, అన్నవరం

ప్రభుత్వం సకాలంలో ఆదుకుంది



కష్టకాలంలో ప్రభుత్వం ఆదుకుంది. వరద ధాటికి కంద, అరటి తోటలు కుళ్లిపోయాయి. తోటను బాగు చేసుకుందామంటే చేతిలో పైసా లేదు. పెట్టుబడంతా వరదపాలైపోయింది. నాకు రూ. 2 లక్షల వరకు నష్టం వాటిల్లింది. చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియడం లేదు. మళ్లీ సాగు చేయాలంటే అప్పు తేవాలనుకున్నా. ఈలోగా ప్రభుత్వం ఆదుకుంది. **- జోగేంద్ర, రైతు, హనుమాన్‌పాలెం**

కొత్తిమీర కట్ట 60 రూ.




- తగ్గిన ఆకుకూరల దిగుబడి
- పెరిగిన ధరలు

న్యూస్‌టుడే - పట్టాభిపురం

ఆకుకూరల ధరలు మండిపోతున్నాయి. బహిరంగ మార్కెట్‌తోపాటు రైతు బజార్లలోనూ రెక్కలొచ్చాయి. కొత్తిమీర కట్ట ధర రూ. 60 పలుకుతుండగా రైతుబజారులో రూ. 40కు అమ్ముతున్నారు. తోటకూర, చుక్కకూర, పాలకూర, బచ్చలికూరలైతే కట్ట రూ. 20 వరకు అమ్ముతున్నారు. వీటి ధరలు రైతుబజార్లలో రూ. 15 వరకు పలుకుతున్నాయి. ఇటీవల భారీవర్షాల కారణంగా ఆకుకూరల తోటలు బాగా దెబ్బతిన్నాయి. సరిగ్గా పంట చేతికొచ్చే సమయంలో వరద ముంచెత్తింది. సాధారణంగా ఆకుకూర పంట చేతికి రావడానికి 20 రోజుల నుంచి నెల రోజుల సమయం పడుతుంది. మధ్యలో వారం పదిరోజులు తప్ప మిగిలిన రోజుల్లో వర్షాలు కురవడంతో పంటను దక్కించుకోవడం సాధ్యం కాలేదు. దీంతో దిగుబడి తగ్గి ధరలు పెరుగుతున్నాయని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు.

- ప్రస్తుతం డిమాండ్‌కు తగ్గట్టుగా హోల్‌సేల్ మార్కెట్, రైతుబజారుకు ఆకుకూరలు రావడం లేదు. గతంలో అయిదు మూటల వరకు తెచ్చిన రైతులు ఇప్పుడు రెండు మూటలకే పరిమితమయ్యారు.
- గతంలో మార్కెట్, రైతుబజార్లకు 300 మూటల నుంచి 500 మూటల వరకు ఆకుకూరల కట్టలు వచ్చేవి. ప్రస్తుతం 250 మూటలకు మించి రావడం లేదు.
- గతంలో ఆకుకూరల కట్ట ఖరీదు రూ. 10 వరకు ఉండేది. నాలుగు కట్టలను గతంలో రూ. 40కు విక్రయించగా.. ఇపుడు రూ. 70 వరకు అమ్ముతున్నారు.
- కొత్తిమీర ధర కొండెక్కి కూర్చుంది. మార్కెట్‌కు చిత్తూరు జిల్లా నుంచి తెస్తుంటారు.
- వచ్చే వారం రోజులపాటు ధరలు ఇలాగే ఉంటాయని మార్కెట్‌వర్గాలు తెలిపాయి.
- సూపర్‌మార్కెట్లలో చిన్నసైజు ఆకుకూరల కట్ట రూ. 15కు విక్రయిస్తున్నారు.



ఇంజినీరు లీలలు!

ఈనాడు - అమరావతి

జల వనరుల శాఖలో ఆస్తులకు రక్షణగా ఉండాల్సిన ఓ కార్యనిర్వాహక ఇంజినీరు భక్షకుడిగా మారారు. కిందిస్థాయి అధికారులు రాసిన నివేదికలు తొక్కిపెట్టి స్థలాలను అడ్డగోలుగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారు. అక్రమార్జనే ధ్యేయంగా ప్రతీ పనిని డబ్బుతో ముడిపెడుతున్నారు. గత ఆగస్టులో అధిక ఉష్ణోగ్రతల కారణంగా కృష్ణా పశ్చిమ డెల్టాలో పంటలకు నీరందక రైతులు అవస్థలు పడినప్పుడు.. సకాలంలో స్పందించి ఆయకట్టుకు తడి అందించడంలో విఫలమయ్యారు. చివరకు జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. కృష్ణా వరదల సమయంలోనూ నిర్మాణాత్మకంగా వ్యవహరించలేదు. గత వైకాపా హయాంలో అప్పటి మంత్రి అండతో సొమ్ములు ముట్టజెప్పి కీలక స్థానాన్ని పొందిన ఆ ఇంజినీరు మళ్లీ ఇప్పుడు మంచి పోస్టింగ్ తెచ్చుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

జలవనరుల శాఖలో అక్రమాలు

డబ్బులిస్తేనే పని!

అంతా అడ్డగోలు వ్యవహారమే.....



- సదరు కార్యనిర్వాహక ఇంజినీరు పరిధిలో కాలువ కట్ట పక్కనే నూతనంగా పెట్రోలు బంకు నిర్మాణానికి దరఖాస్తు వచ్చింది. క్షేత్రస్థాయి ఇంజినీరు పరిశీలించి కాలువకు 120 మీటర్ల వరకు గ్రీన్ జోన్, బఫర్ జోన్ ఉన్నందున బంకు ఏర్పాటుకు అనుమతి ఇవ్వలేమని నివేదిక ఇచ్చారు. దీనికితోడు కాలువ పక్కన జలవనరులశాఖకు చెందిన 70 సెంట్ల స్థలం పక్కనే ఉన్నందున అనుమతి ఇవ్వలేమని తేల్చి చెప్పారు. దరఖాస్తుదారుడు మరోసారి పరిశీలించాలని విన్నవించగా.. క్షేత్రస్థాయి అధికారుల నివేదిక రాకుండానే సదరు కార్యనిర్వాహక ఇంజినీరు అనుమతిచ్చేశారు.
- తెనాలి పట్టణంలో జల వనరులశాఖ స్థలంలో ఉన్న రెండు పెట్రోలు బంకుల నిర్వాహకులు కొన్నేళ్లుగా నామమాత్రపు లీజు చెల్లిస్తున్నారు. అంతేకాదు.. లీజు ఒప్పందం కుదుర్చుకున్నవారు మరొకరికి లీజుకిచ్చినట్టు జలవనరులశాఖ పరిశీలనలో తేలింది. వీటన్నింటినీ సమీక్షించి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలొచ్చినా.. లీజుదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఆదాయానికి గండి కొట్టారు.
- తెనాలిలో కాలువ పక్కన ఉన్న విలువైన స్థలాలను పలువురు ఆక్రమించినా పట్టించుకోవడం లేదు. ఓ వ్యక్తైతే తను ఆక్రమించిన స్థలాలను ఇతరులకు అనధికారికంగా లీజుకిచ్చేశారు. దీని వెనుక సదరు కార్యనిర్వాహక ఇంజినీరు ఉన్నారు.
- ఉద్యోగుల డిప్యుటేషన్లు, బదిలీలు మొదలు స్థలాల లీజు వరకు ప్రతి పనిలోనూ ఆయన చేయి తడపాల్సిందే. కృష్ణా పశ్చిమ డెల్టాలో కీలక స్థానంలో ఉన్నప్పటికీ సాగునీటి సరఫరా వ్యవస్థను గాడిలో పెట్టలేకపోయారు. కాలువకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసినా ఆయకట్టు చివరి పొలాలకు నీరందని పరిస్థితి. గత ఆగస్టులో రైతులు ఆయిల్ ఇంజిన్ల ద్వారా పొలాలకు నీటిని తోడాల్సి వచ్చింది.

గీత దాటారు.. వేటు పడింది!

ఇద్దరు సీఐలు, మరో ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్



ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరు సీఐలు, మరో ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు పడింది. ఏక కాలంలో నలుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు పడటం ఈ మధ్య కాలంలో ఇదే తొలిసారి కావటం గమనార్హం. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఇచ్చిన నివేదికను అనుసరించి వారిని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడినా.. ప్రజలతో అమర్యాదగా ప్రవర్తించినా, వారిని ఇబ్బందులకు గురి చేసినట్లు ఫిర్యాదులొచ్చినా వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కూటమి ప్రభుత్వం అధికారపగ్గాలు చేపట్టగానే పోలీసులకు దిశానిర్దేశం చేసింది. పోలీసులు.. ప్రజలతో మర్యాదగా మెలగాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. అందుకు భిన్నంగా గుంటూరు నగరంలో ఇటీవల ఓ కేసు విషయంలో ఓ సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల గీత దాటి వ్యవహరించినట్టు ఎస్పీ విచారణలో తేలింది. ఇందుకు వారు మూల్యం చెల్లించుకున్నారు. ఒంగోలుకు చెందిన ఓ యువకుడిపై భార్య ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు ఆ యువకుడికి ముందస్తు అరెస్టు నోటీసులు ఇవ్వకుండా.. మీపై కేసు ఉందని, అరెస్టు చేస్తున్నామని చెప్పి బలవంతంగా జీపులో ఎక్కించుకుని తీవ్రంగా వేధించారు. ఆ యువకుడు వారి బారి నుంచి తప్పించుకుని అదే రోజు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీని తీవ్రంగా పరిగణించిన ఆయన వెంటనే విచారణ చేయించారు. ఈ వ్యవహారంలో గీత దాటిన డీసీఆర్‌బీ సీఐ బిలాలుద్దీన్ సహా కానిస్టేబుళ్లు చాంద్‌బాషా, షేక్ నూరుల్లాపై సస్పెన్షన్ వేటు వేశారు.

- గతంలో పొన్నూరు సీఐగా పనిచేసిన మీసాల రాంబాబుపై అనేక అవినీతి ఆరోపణలొచ్చాయి. ప్రస్తుత ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు ఏ మాత్రం సంబంధం లేకపోయినా... సంగం పాల డెయిరీ వద్దకు ఆందోళనకు వచ్చిన రైతులను కొట్టి దూషించినట్లు ఆయనపై హత్యాయత్నం కేసులు పెట్టారు. అది తప్పుడు కేసుగా నిర్ధారించి ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆ సీఐపై కొందరు క్వారీ యజమానులు ఫిర్యాదు చేశారు. వాటన్నింటిపై ఎస్పీ విచారణ చేయించి నివేదిక ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాంబాబును సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఆయన పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ సీఐగా ఉన్నారు.

ఖజానాలో తీరింతేనా?



రూ. కోట్లు దారి మళ్లినా బాధ్యులపై చర్యలేవి?

ఒక్క ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోనే ఖజానాశాఖ ఉద్యోగులు పక్కదారి పట్టించిన మొత్తం రూ. 4 కోట్లపైమాటే..

ఇది శాఖాపరమైన దర్యాప్తులో నిగ్గు తేలినా.. బాధ్యుల్లో కొందరిపై ఇంతవరకు మొక్కుబడి చర్యలే తీసుకున్నారు..

ఈ అక్రమాలను 'ఈనాడు' వెలుగులోకి తేవడంతో ప్రభుత్వం స్పందించింది.

పక్కదారి పట్టిన నిధుల్లో వెనక్కి రాబట్టింది ఎంత? బాధ్యులైన ఉద్యోగులపై తీసుకున్న చర్యలేమిటో ఆ శాఖ సంచాలకుడు నాలుగు రోజుల క్రితం ఖజానా కార్యాలయాలకు లేఖ రాయడం తాజా పరిణామం...

ఈనాడు - అమరావతి

- తెనాలి ఉప ఖజానా కార్యాలయంలో జూనియర్ అకౌంటెంట్ వరుణ్‌బాబు రూ. కోటి నిధులు తన బంధువుల ఖాతాకు మళ్లించారు. ఇది గుర్తించి ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేసి విధుల నుంచి తొలగించారు. ఆ మొత్తం రికవరీ కాలేదు. దీనిపై ఆ శాఖ డైరెక్టర్ వివరణ కోరగా స్థానిక అధికారులు హడావుడిగా తెనాలి పోలీసులను సంప్రదించి వరుణ్‌కు చెందిన రెండు కార్లు, బైకులు స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ రూ. 11.07 లక్షలు ఉంటుందని సమాధానం రాసి పంపారు.
- ఐదేళ్ల క్రితం గుంటూరు జిల్లా ట్రెజరీ కార్యాలయం అధికారులు.. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో కుమ్మక్కై రూ. 1.10 కోట్లు దుర్వినియోగానికి పాల్పడ్డారు. మొన్నటి వరకు విచారణ జరిగింది. వైద్య-ఆరోగ్యశాఖ పరిధిలో 300 ఓసీఎస్ పద్దు కింద పని చేసే ఒప్పంద ఉద్యోగులకు ప్రభుత్వం నిర్దేశించిన కన్సాలిడేట్ అమౌంట్ మాత్రమే చెల్లించాలి. అందుకు భిన్నంగా సుమారు 110 మందికి పీఆర్సీ ప్రయోజనాలు దోచిపెట్టారు. ఇటీవలే బాధ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి ఆ మొత్తం రికవరీకి ఆదేశించారు.
- రేపల్లె పరిధిలోని అత్తోట పీహెచ్‌సీలో లేని ఉద్యోగులను సృష్టించి రూ. కోటిన్నర దాకా చెల్లించారు. ఆ మొత్తాన్ని అక్కడ పని చేసే రబ్బానీ అనే ఎస్టీవో, క్లర్క్ కుమార్‌బాబు కారకులుగా విచారణలో తేలినా ఇంకా చర్యలు తీసుకోలేదు. వారు కోర్టుకెళ్లడంతో తిరిగి విచారణ చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించగా ఓ అధికారి నాట్ ప్రూవ్డ్ అని రాసి సొంత లబ్ధి చూసుకున్నారని తెలిసింది. దీనిపై ప్రభుత్వం తాజాగా వివరణ కోరటంతో రేపల్లె ఖజానా అధికారులు వివరణ ఇవ్వటానికి సన్నద్ధమవుతున్నారు.
- రేపల్లె ఉప ఖజానా కార్యాలయ ఉద్యోగులు మార్కెట్‌యార్డుకు చెందిన రూ. 50 లక్షల చెక్కులను మాయం చేశారు. శాఖాపరమైన విచారణలో నిగ్గు తేలినా బాధ్యులైన ఉద్యోగులపై చర్యలు తీసుకోలేదు.

15 రోజుల్లోనే గండ్ల పూడ్చివేత



రేవేంద్రపాడు సమీపంలో 12.800 కిలోమీటరు వద్ద పూడ్చిన గండి

న్యూస్‌టుడే - కొల్లిపర

ఇటీవల వర్షాలకు కృష్ణా పశ్చిమ కాలువ గట్లకు అడుగడుగునా గండ్లు పడ్డాయి. వరద నీరు పొలాలను ముంచెత్తింది. డెల్టాలోని 1.41 లక్షల ఆయకట్టు ప్రమాదంలో పడింది. గత వైకాపా ప్రభుత్వం నిధులివ్వకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు రంగంలోకి దిగిన ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టింది. కేవలం 15 రోజుల వ్యవధిలో 5 చోట్ల పెద్ద గండ్లను పూడ్చించింది.

- మంగళగిరి రేవేంద్రపాడు సమీపంలోని 12.800 కిలోమీటరు వద్ద, నూతక్కి డొంక చేరువలో 15.150 కిలోమీటరు, పెదకొండూరు వంతెన సమీపంలో 19.150 కిలోమీటరు, అత్తలూరివారిపాలెం వద్ద 21.435 కిలోమీటరు సమీపంలో పెద్ద గండ్లు పడ్డాయి. పలుచోట్ల గట్టు బలహీనపడి మట్టి కిందకు జారిపోయింది. ఈ పనులను అధికారులు రోజుల వ్యవధిలోనే పూర్తి చేశారు. కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యం 2,022 క్యూసెక్కులు కాగా.. ప్రస్తుతం 1,650 నుంచి 1,900 క్యూసెక్కుల వరకు ప్రవహిస్తోంది. ఇంకా కొన్నిచోట్ల ర్యాంపుల పనులు కొనసాగుతున్నాయి.
- మంగళగిరి రేవేంద్రపాడు (12.4 కిలోమీటరు) వద్ద ప్రారంభమై బాపట్ల జిల్లా అడవిపాలెం వరకు ఆయకట్టుకు ఆ కాలువ నీరే ఆధారం. ముంపుతో అపార నష్టం వాటిల్లినా.. మిగిలిన కొద్దిపాటి పంటను రైతులు కాపాడుకోవడానికి వీలుగా ప్రభుత్వం గండ్ల పూడ్చివేత పనులను పూర్తి చేసింది.

నూతక్కి డొంక చేరువలో 15.150 కిలోమీటరు వద్ద ఇలా..



- కృష్ణా పశ్చిమ కాలువ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించామని నీటిపారుదల ఏఈ రవిబాబు చెప్పారు. కట్టల బలోపేతానికి రూ. 60 లక్షల ప్రాథమిక అంచనాతో ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. గండ్లను గుత్తేదారులు పూడ్చేశారని, రిటైనింగ్ వాల్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. రూ. 40 లక్షలతో పనులు తుది దశలో ఉన్నాయని చెప్పారు.

స్వచ్ఛత సరే.. సదుపాయాలేవీ..?

ప్రయాణికులకు అందుబాటులోకి రాని మూత్రశాలలు ❖ గుంటూరు రైల్వే స్టేషన్ దుస్థితి ఇదీ

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే

గుంటూరు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన కనీస సదుపాయాలు కరవయ్యాయి. అత్యవసరమైన మూత్రశాలలు లేక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఆర్‌యూబీలో బురద పేరుకుపోయి నడవాలంటే అవస్థలు పడుతున్నారు. తాజాగా ప్రధాన గేటు వద్ద విధులు నిర్వహించే టికెట్ తనిఖీ సిబ్బంది సమీపంలో పైకప్పు నుంచి పెద్ద పెద్ద పెచ్చులు ఊడి పడ్డాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ప్రమాదం జరగలేదు. ఇదంతా నాణానికి ఒకవైపు. మరోవైపు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛతపై పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. చీపుర్లు పట్టుకుని రైల్వే స్టేషన్ ఆవరణలో శుభ్రం చేస్తున్న అధికారులు.. కనీస సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టకపోవడంపై ప్రయాణికులు, ఉద్యోగుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఆర్‌యూబీలో నీరు నిలిచి ప్రయాణికుల ఇక్కట్లు (పాత చిత్రం)

రూ.కోట్లతో సుందరీకరణ

గుంటూరు రైల్వే స్టేషన్‌ను రూ.కోట్ల వ్యయంతో పాతవాటిని సుందరీకరణ చేస్తున్నారు. ప్రయాణికులకు అవసరమైన మేర మూత్రశాలలు ఏర్పాటు చేయలేకపోయారు. ఉన్నవాటినీ మూసివేశారు. మూత్రం ఆపుకోలేని పురుషులు ఎవరూ చూడకుండా పట్టాలపై బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తుండటం గమనార్హం. కొందరు ఆగి ఉన్న రైళ్లలో ఉన్న వాటిని వినియోగించుకుంటున్నారు. స్త్రీలు ఏమీ చేయలేక మౌనంగా, ఎవరికీ చెప్పుకోలేక గుట్టుగా వెళ్లిపోతున్నారు.

వర్షం వస్తే ఆర్‌యూబీలో నీరు

వర్షం వస్తే ఆర్‌యూబీలో నీరు చేరుతుంది. ఆ మార్గాన ప్రయాణం చేయాలంటే నరకయాతన అనుభవించాల్సిందే. ప్రస్తుతం ఎండగా ఉన్నప్పటికీ అక్కడ బురద పేరుకుపోయి ఉండటం గమనార్హం. అధికారులు నిత్యం రాకపోకలు సాగించే గుంటూరు స్టేషన్‌లోనే కనీస సదుపాయాలు కరవయ్యాయని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు.



తాళాలు వేశారు

గుంటూరు రైల్వే స్టేషన్‌లో మొత్తం 7 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. రైళ్ల కోసం ప్రయాణికులు ఈ ప్లాట్‌ఫాంలపై వేచి ఉంటారు. అయినప్పటికీ మూత్రశాలల సదుపాయం కేవలం ఒకటో ప్లాట్‌ఫాం చివరన రైల్వే పార్శిల్ కార్యాలయం వద్ద మాత్రమే ఉంది. మిగిలిన వాటిలో ఉన్న మరుగుదొడ్లన్నింటికీ తాళాలు వేశారు. మూత్ర విసర్జన చేయాలంటే మిగిలిన ఆరు ప్లాట్‌ఫాంల నుంచి ఒకటో నంబరు వరకు రావాల్సిన దుస్థితి ఏర్పడింది.

వినియోగదారుల సేవలకే ప్రాధాన్యం

విద్యుత్తు అదాలత్‌లో ఛైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానుయేల్



రామకృష్ణను ప్రశ్నిస్తున్న విక్టర్ ఇమ్మానుయేల్, పక్కన సునీత, విజయకుమార్, వెంకటకృష్ణ

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: వినియోగదారుడు వ్యవసాయ సర్వీసు కోసం దరఖాస్తు పెట్టుకుని 13 సంవత్సరాలు గడిచినా చర్యలు తీసుకోకపోవడంపై సంబంధిత అధికారి రామకృష్ణపై సెంట్రల్ డిస్కం విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్‌పర్సన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే కేసు తమ దృష్టికి తీసుకురాగానే నెల రోజుల్లోనే పరిష్కారం చూపామన్నారు. ఇటువంటి కేసులు గత మూడేళ్లలో 600 వరకు పరిష్కరించామని ఆయన తెలిపారు. విద్యుత్తు భవన్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక విద్యుత్తు అదాలత్ అనంతరం విలేకరులతో మాట్లాడారు. చట్ట పరిధిలో వచ్చే అన్ని ఫిర్యాదులకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రాథమిక ఆధారాలుంటే వెంటనే ఉత్తర్వులిస్తామన్నారు. అదే సమయంలో తప్పుడు ఫిర్యాదులు చేస్తే తగిన చర్యలు తీసుకునే అధికారం తమకుందన్నారు. కొంతమంది హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో ఉన్న కేసులను దాచిపెడుతున్నారని, అది సరైన విధానం కాదన్నారు. వినియోగదారులు సమస్యలపై ముందుగా సమీపంలోని అధికారికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని, అవసరమైతే ఉన్నతాధికారికి వినతిపత్రం ఇవ్వాలన్నారు. నిర్ణీత గడువు లోపు పరిష్కారం కాకపోతే మా దృష్టికి తీసుకురావొచ్చన్నారు. ఇరువైపుల వాదనలు విన్న తర్వాత 60 రోజుల్లోపు తీర్పు ఇస్తామన్నారు. మేము స్వతంత్రంగా వ్యవహరిస్తామని, వినియోగదారులకు అండగా నిలుస్తామన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు కె.వెంకటకృష్ణ, శ్రీనివాసరావు, ఎం.సునీత, ఎస్ఈ విజయకుమార్, ఈఈ శ్రీనివాసబాబు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు లక్ష్మీనారాయణ, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

సదస్సు దృష్టికి వచ్చిన సమస్యలివే..

- ✦ అమరావతి రోడ్డులో పరిశ్రమను నడుపుతున్నాం. ఒకసారి కరెంటు పోతే తమకు రూ.10 వేలు నష్టం జరుగుతోంది. విద్యుత్తు సరఫరా నిలిపివేసే సమాచారం ముందుగా ఇవ్వాలి.
- ✦ గడువు లోపు బిల్లు చెల్లించినా మరుసటి నెలలో అపరాధ రుసుం వసూలు చేస్తున్నారు.
- ✦ చిన్న దుకాణానికి అదనపు లోడ్ పేరిట రూ.వేలు చెల్లించమని నోటీసు ఇచ్చారు. మరోసారి తనిఖీ చేసి నిర్ణయం తీసుకోవాలి.
- ✦ టౌన్-4 సబ్ డివిజన్ పరిధిలో పలుచోట్ల విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. గాలివాన వచ్చినపుడు సరఫరాలో అంతరాయం వస్తోంది.

అక్రమాల కేసుల్లో నెల రోజుల్లో పురోగతి చూపిస్తాం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: సొసైటీల ద్వారా జీడీసీసీ బ్యాంకులో జరిగిన అక్రమాలపై నమోదైన కేసుల్లో నెల రోజుల్లో పురోగతి చూపిస్తామని గుంటూరు ఎస్పీ సతీశ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో శాంతిభద్రతలు, నమోదైన కేసుల విచారణ పరిస్థితిపై సీఐ శ్రీనివాసరావు, ఎస్సై నాగేంద్రలతో చర్చించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జాతీయ రహదారి వెంట వ్యభిచారం జరగకుండా చూడాలని సీఐకి ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. నేరాలు, మోసాలు, శాంతి భద్రతలపై అవగాహన కలిగించే వారధి కార్యక్రమాన్ని త్వరలో అమలు చేయాలని సీఐకి చెప్పినట్లు ఎస్పీ వెల్లడించారు.

30న ఏఎన్‌యూకు వెంకయ్యనాయుడు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈనెల 30న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి రానున్నారు. పద్మవిభూషణ్ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి శత జయంత్యుత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్రమంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, స్థానిక శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర ఈ సభలో పాల్గొననున్నారు. సభ నిర్వహణకు ఇన్‌ఛార్జ్ వీసీ ఆచార్య గంగాధర్ 8 కమిటీలను నియమించారు. ఆహ్వానం, సేవలు, సన్మానం, రవాణా, మీడియా, అకడమిక్ తదితర కమిటీలతో ఆచార్య గంగాధర్ సమావేశమయ్యారు. సభను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, సంచాలకులు త్రిమూర్తిరావు, కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హస్త కళా ఉత్సవ్



ప్రదర్శనను ప్రారంభిస్తున్న సంయుక్త కలెక్టర్ భార్గవ్ తేజ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో గురువారం హస్త కళా ఉత్సవ్ ప్రారంభమైంది. జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. హస్తకళా, చేనేత వస్త్రాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా తయారు చేసిన వివిధ ఉత్పత్తుల అమ్మకం ద్వారా కార్మికుల జీవన స్థితిగతులను మెరుగుపర్చేందుకు నాబార్డు ఆధ్వర్యంలో ఈ ఉత్సవ్‌ను ఏర్పాటు చేశారన్నారు. చేనేత, హస్త కళాకారులకు మార్కెటింగ్ సదుపాయాలు పెంచడంలో ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. నాబార్డు ద్వారా మహిళలకు, యువతకు, చేతి వృత్తుల వారికి శిక్షణ ఇవ్వడమే కాకుండా ఇటువంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయడం మంచి విషయమన్నారు. నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.ఆర్.గోపాల్ మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ వరకు ఉత్సవం కొనసాగుతుందన్నారు. మొత్తం 46 స్టాళ్లు ఏర్పాటు చేశామని, ఇందులో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు తయారుచేసిన ప్రత్యేక చేనేత వస్త్రాలు, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల నుంచి వివిధ రకాల వస్త్రాలు తక్కువ ధరకే అందుబాటులో ఉంచామన్నారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ ప్రమోద్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ఎవరికైనా రుణ సౌకర్యం అందిస్తామన్నారు. ఎస్‌బీఐ డీజీఎం కృష్ణకుమార్ బి.ప్రభు, యూబీఐ డీజీఎం జవహర్, నాబార్డ్ డీజీఎం శరత్, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, చేనేత సంఘాల ప్రతినిధులు, హస్త కళాకారులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్ ప్రజాదర్బార్ నేడు

తాడేపల్లి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖా మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ 27వ తేదీ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. ఆ సమయంలో వచ్చిన వారికి అవకాశం లభిస్తుందని మంగళగిరి తెదేపా కార్యాలయం నుంచి గురువారం ప్రకటన విడుదల చేశారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారు.

డీసీఎంఎస్ మహాజన సభ నేడు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ సొసైటీ మహాజన సభ శుక్రవారం జరుగుతుందని సొసైటీ బీఎం హరిగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్, సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి ఎ.భార్గవ్ తేజ అధ్యక్షతన జిల్లా కోర్టులోని సొసైటీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సభ జరుగుతుందన్నారు.

ఎక్సైజ్ డీసీ శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎక్సైజ్ శాఖ గుంటూరు జోన్ ఉపకమిషనర్ (డీసీ)గా డాక్టర్ కె.శ్రీనివాసులు గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో నెల్లూరు జిల్లా సహాయ కమిషనర్ (ఏసీ)గా, భీమవరం, గుంటూరు, అనంతపురం జిల్లాల్లో ఏసీగా, సెబ్ ప్రధాన కార్యాలయంలో ఉపకమిషనర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా డీసీ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ నాటుసారా నిర్మూలనకు, సుంకం చెల్లించని మద్యం రవాణా, విక్రయాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. వైకాపా ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సెబ్‌ను రద్దు చేసి ఎక్సైజ్‌శాఖను పునర్ వ్యవస్థీకరించిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లకు తమ శాఖ అధికారులు, సిబ్బంది తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు డీసీ శ్రీనివాసులు చెప్పారు.

సహాయ కమిషనర్‌గా రవికుమార్‌రెడ్డి



గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎక్సైజ్ శాఖ జిల్లా సహాయ కమిషనర్ (ఏసీ)గా ఎం. రవికుమార్‌రెడ్డి గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో గుంటూరు జిల్లా ఏసీగా నియమితులయ్యారు. ఏసీ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ గంజాయి, నాటుసారా నిర్మూలనకు కృషి చేస్తామన్నారు.

ఈఎస్‌గా అరుణకుమారి



నెహ్రూనగర్, న్యూస్‌టుడే : గుంటూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా (ఈఎస్)గా వి. అరుణకుమారి గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆమె గుంటూరు ఈఎస్‌గా నియమితులయ్యారు. మద్యం దుకాణాల పర్యవేక్షణ, మద్యం అక్రమ రవాణా, గంజాయి, నాటుసారాపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామని 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

దేవాదాయశాఖ డీసీగా శ్రీనివాసరావు



నెహ్రూనగర్, న్యూస్‌టుడే : దేవాదాయశాఖ గుంటూరు జోన్ ఉపకమిషనర్ (డీసీ)గా కేబీ శ్రీనివాసరావు గురువారం నాజ్‌కూడలిలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పెదకాకాని దేవస్థానం ఈవోగా, గుంటూరు జిల్లా సహాయ కమిషనర్‌గా, మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవోగా పనిచేశారు. ఇటీవల బదిలీలలో ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డీసీని ఆశాఖ అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. దేవాలయాల్లో భక్తులకు సౌకర్యాల కల్పన, ఆలయాల అభివృద్ధి, అర్చకులు, సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

జగన్ లెంపలేసుకొని చేసిన తప్పు సరిదిద్దుకోవాలి

సనాతన ధర్మ పరిరక్షణ ఐకాస నేతల డిమాండ్



మాట్లాడుతున్న శ్రీధర్ శర్మ, వేదికపై నాగేశ్వరరావు, కుమార్, నరేంద్ర, రాము, రామలింగేశ్వరశాస్త్రి, అమర్‌నాథ్, శ్రీవిద్య

పట్టాభిపురం (గుంటూరు), న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించి పాపం మూటకట్టుకున్న జగన్ లెంపలేసుకొని చేసిన తప్పును సరిదిద్దుకోవాలని సనాతన ధర్మ పరిరక్షణ ఐకాస నేతలు డిమాండ్ చేశారు. ఈనెల 28న కాలినడకన తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటానని ఆయన చెప్పడం హిందూ మత, సనాతన ధర్మ విశ్వాసాలను, భక్తుల మనోభావాలను రెచ్చగొట్టడమేనని చెప్పారు. గుంటూరులోని బ్రాహ్మణ చైతన్య వేదిక కార్యాలయంలో ఐకాస నేతలు సిరిపురపు శ్రీధర్‌శర్మ, దాసరి రాము, డాక్టర్ కోనేరు శ్రీవిద్య, వనమా నరేంద్ర, జంధ్యాల రామలింగేశ్వరశాస్త్రి, వావిలాల కుమార్, నల్లపనేని అమర్‌నాథ్‌లు గురువారం మీడియాతో మాట్లాడారు. 'జగన్‌కు నిజంగా వేంకటేశ్వర స్వామిపై భక్తి, నమ్మకం, విశ్వాసం ఉంటే భార్య భారతితో సహా కొండకు కాలినడకన వచ్చి తలనీలాలు సమర్పించాలి. అలిపిరి చేరే ఒకరోజు ముందే శుక్రవారమే డిక్లరేషన్‌పై సంతకం చేస్తానని ప్రకటించాలి. జగన్ తన స్వార్థం కోసం భక్తులను రెచ్చగొట్టేందుకు తిరుమల పర్యటన పెట్టుకున్నారు. శ్రీవారి భక్తులు, హిందూ ధార్మిక సంఘాలు, స్వామీజీలు అందరూ కలిసి కచ్చితంగా అడ్డుకుని తీరతాం. వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్‌లు.. తిరుమలకు వచ్చినా డిక్లరేషన్‌పై ఏనాడూ సంతకాలు చేయలేదు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న అయిదేళ్లలో ఏనాడూ భార్య భారతితో కలిసి స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించలేదు. డిక్లరేషన్‌లో సంతకం పెడతామని ముందే ప్రకటిస్తే ఆయన పర్యటన అడ్డుకోం. లేకపోతే.. 28న అలిపిరి వద్దకు సనాతన ధర్మ పరిరక్షకులు, శ్రీవారి భక్తులు వేలాదిగా చేరుకుని అడ్డుకుంటాం'..అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐకాస నాయకులు శానం రమేష్, పెద్దింటి కృష్ణ చైతన్య, ఎండపల్లి శబరి, చిలుమూరు ఫణి, వడ్లమూడి నాగేశ్వరరావు, పెమ్మరాజు సుధాకర్, వంగవీటి చైతన్య, వడ్డమాను ప్రసాద్, పోలూరి రామారావు పాల్గొన్నారు.

గుంటూరు ఆర్డీవోగా శ్రీనివాసరావు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు ఆర్డీవోగా కె.శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఆర్డీవోగా పనిచేసిన పి.శ్రీకర్‌ను కోనసీమ జిల్లా కొత్తపేట డివిజన్‌కు బదిలీ చేసింది. ప్రస్తుతం విజయవాడలోని ఆర్ అండ్ ఆర్ ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్న శ్రీనివాసరావు ఆర్డీవోగా గుంటూరు రానున్నారు.

వైద్య నిపుణుల క్షేత్ర స్థాయి సందర్శన

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇటీవల డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలిన ప్రాంతాలను నిపుణులైన వైద్యులు పరిశీలిస్తున్నారు. గుంటూరు వైద్య కళాశాల జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, ఎస్‌పీఎం విభాగాలను చెందిన నిపుణులు గురువారం నుంచి క్షేత్ర స్థాయి పర్యటన ప్రారంభించారు. మంగళగిరితో పాటు తుళ్లూరు, పెదకాకాని మండలాల్లో ఇంటింటికీ తిరిగి వ్యాధిగ్రస్థులతో మాట్లాడనున్నారు. ఈనెల 28వ తేదీతో వీరి పర్యటన ముగియనుంది. అనంతరం డీఎంహెచ్‌వోకు నివేదిక ఇవ్వనున్నారు.

నిరసన కార్యక్రమాలు వాయిదా

గుంటూరు వైద్యం: జీజీహెచ్‌లో ఒప్పంద విధానంలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలనే ప్రధాన డిమాండ్‌తో 22 రోజుల నుంచి చేస్తున్న నిరసన కార్యక్రమాలను వాయిదా వేసినట్లు ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ నాయకులు తెలిపారు. ప్రభుత్వంతో చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. గడువులోపు డిమాండ్ల పరిష్కారంలో అధికారులు తగు చర్యలు తీసుకోకపోతే ఆందోళన తిరిగి ప్రారంభిస్తామని వారు తెలిపారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు 1 నుంచి రిలే దీక్షలు



మాట్లాడుతున్న రాధాకృష్ణమూర్తి, వేదికపై అరుణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రాజమోహన్ తదితరులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు దశల వారీగా ఆందోళనలు చేయనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి తెలిపారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ గురువారం కొత్తపేటలోని కార్యాలయంలో ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అరుణ్‌కుమార్, లక్ష్మీనారాయణ అధ్యక్షతన ప్రజాసంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ పలువురి ప్రాణత్యాగాలు, ఎమ్మెల్యేలు, ఎంపీల పదవీత్యాగాలు, వేలాది మంది పోరాట ఫలితంగా ఏర్పడిన ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేట్, కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి యత్నిస్తున్నారని విమర్శించారు. కర్మాగారాన్ని కాపాడుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్ 1, 2, 3 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద ఈ దీక్షలు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు శ్రీనివాస్, రాజమోహన్, అజయ్‌కుమార్, కోటయ్య, శివాజీ, చిష్టి, వలి, కిరణ్, కోటేశ్వరరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో 34 మి.మీ వర్షపాతం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు సగటున 7.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అధికంగా తెనాలి మండలంలో 34 మి.మీ నమోదు కాగా.. దుగ్గిరాల 25.8, పొన్నూరు 23.4, కొల్లిపర 13.4, పెదనందిపాడు 10.6, తాడికొండ 6.2, గుంటూరు తూర్పు 4, తుళ్లూరు 3.6, చేబ్రోలు 2.6, పెదకాకాని 2.2, కాకుమాను 2, తాడేపల్లి 1.8, గుంటూరు పశ్చిమ 1.6, ఫిరంగిపురం 1.6, ప్రత్తిపాడు 1.2, మేడికొండూరు 0.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ఆశ పెట్టి.. మోసం చేసి..

ఆన్‌లైన్ వేదికగా రూ.3 లక్షలు నష్టపోయిన యువకుడు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి నాజరుపేటకు చెందిన యువకుడు ఇటీవల బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు. ఈనెల 20న ఆయన చరవాణికి ఒక లింక్ వచ్చింది. దానిని ఆయన క్లిక్ చేశారు. టాస్క్ ఇస్తాం..పూర్తి చేస్తే నగదు బహుమతిగా వస్తుందన్న సమాచారం వచ్చింది. ఆయన అలాగే అన్నారు. ఒక మ్యాప్ ఇచ్చి సరైన ఫొటోలను ఖాళీల్లో నింపాలన్న ఆట వంటి టాస్క్ ఇచ్చారు. యువకుడు అటువంటివి రెండు విజయవంతంగా పూర్తి చేశారు. ఆయన ఖాతాకు రూ.400 జమయ్యాయి. రెండో రోజు తిరిగి ఆట మొదలైన తర్వాత మీరు కొంత నగదుతో ఆడితే లాభం కూడా బాగా వస్తుందని సందేశం వచ్చింది. దాంతో యువకుడు రూ.5 వేలు పెట్టుబడి పెట్టారు. సాయంత్రం వరకు ఆడాక ఆయనకు రూ.6,300 చేరాయి. అంటే రూ.1300 అదనంగా వచ్చాయి. మరుసటి రోజు యువకుడు రూ.20 వేలు పెట్టుబడి పెట్టారు. నీ సిబిల్ స్కోర్ తక్కువగా ఉంది.. మరో రూ.30 వేలు జమ చేయి..అప్పుడు మొత్తం మీద లాభం వస్తుందన్న సమాచారంతో ఆ మొత్తం కూడా పంపారు. తదుపరి వాటికి జీఎస్టీ కట్టాలని, ఇతరత్రా మాయ మాటలు చెప్పి తుదకు మొత్తం మీద రూ.3 లక్షలు లాగేసిన తర్వాత సమాధానాలు నిలిచిపోయాయి. ఇదంతా ఈనెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నడిచింది. తుదకు తాను మోసపోయానని గుర్తించిన యువకుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

తాడికొండ బస్టాండ్ సమీపంలోని, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించారు. వ్యర్థాలు రోడ్డుపైకి చేరడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని 'మేమున్నాం..' మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి రావడంతో వారు స్పందించారు. పంచాయతీ సిబ్బందిని పంపించి చెత్త తొలగించారు.
- న్యూస్‌టుడే, తాడికొండ

వధూవరులకు మంత్రి లోకేశ్ పెళ్లికానుక

మంగళగిరి: మంగళగిరి బాప్టిస్ట్‌పేటలో వధూవరులైన సుమిత్ర, దానియేలుకు మంత్రి నారా లోకేశ్ పెళ్లికానుక పంపారు. నాయకులు గోవాడ దుర్గారావు, కొడమల సురేష్, వాకా మాధవరావు, రావూరి విజయానంద్, వల్ల రమేష్ ద్వారా నియోజకవర్గ ఎన్నికల అధ్యక్షు ద్వారా నూతన వస్త్రాలు, మంగళసూత్రాలు అందజేశారు.

భక్తితో హోమం

మేడికొండూరు: మేడికొండూరులో జరుగుతున్న హోమం గురువారం ముగిసింది. పూర్ణాహుతి, భారీ అన్నదానం జరిగింది. గ్రామంలోని బొడ్డురాయి సెంటర్లో ఈనెల 22వ తేదీ ఆదివారం ఉదయం ఈ కార్యక్రమం ప్రారంభమైంది. కొద్ది రోజుల కిందట గ్రామానికి చెందిన ప్రసన్నాంజనేయ స్వామి భక్త సమాజం ఆధ్వర్యంలో లక్ష రోజుల అష్టోత్తర జప మంత్ర మహా యజ్ఞం జరిగింది. దీనిని పురస్కరించుకుని హోమం నిర్వహించారు.



ప్రయాణం.. నరకప్రాయం

➜ ప్రమాదకరంగా పాతమద్రాసు రోడ్డు ➜ కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తే ప్రజలకు ప్రయోజనం



అబ్బినేనిగుంటపాలెం వద్ద దెబ్బతిన్న రహదారి

ప్రత్తిపాడు, తాడేపల్లి, పెదనందిపాడు, తుళ్లూరు, న్యూస్‌టుడే

❖ నెలన్నర కిందట చిననందిపాడు వద్ద ఓ ఆర్టీసీ ప్రైవేటు బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాల్వలోకి దూసుకెళ్లింది. అందులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

❖ రెండు నెలల క్రితం పెదనందిపాడుకు చెందిన యువకుడు కారులో వెళ్తుండగా, ప్రత్తిపాడు శివారులోని మలుపు వద్ద రోడ్డు ఎగుడుదిగుడు కారణంగా కారు అదుపుతప్పి పక్కనే ఉన్న కాల్వలోకి వెళ్లింది. ఆ యువకుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.

పాతమద్రాసు రోడ్డుగా పేరొందిన గుంటూరు- పర్చూరు రోడ్డు గత పాలకుల తీరుతో ప్రమాదకరంగా మారింది. కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. ప్రత్తిపాడు నుంచి పెదనందిపాడు, బాపట్ల జిల్లా పర్చూరు వరకు రోడ్డు అనేక చోట్ల బీటలు వారింది. ప్రత్తిపాడు, అబ్బినేనిగుంట పాలెం, వరగాని, పెదనందిపాడు, చిననందిపాడు వరకు రోడ్డు పగిలిపోయి, పల్లంగా మారింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వేలాది మంది ప్రయాణం చేస్తుంటారు. రోడ్డు పరిస్థితి దారుణంగా ఉండడంతో కార్లు, ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పక్కనే ఉన్న కాల్వల్లోకి వెళ్లిన ఘటనలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్రనాయుడు దృష్టికి తీసుకెళ్లగా, మరమ్మతులకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపామని, నిధులు మంజూరయితే త్వరలో పనులు చేపడతామని చెప్పారు.

❖ ఇటీవల కురిసిన వర్షాలకు తాడేపల్లి రైల్వేగేట్ మార్గంలో గుంతలుపడి బాటసారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డు కొంత రైల్వే శాఖకు చెందినదికాగా మరికొంత నగరపాలక సంస్థ పరిధిలో ఉంది. మరమ్మతులు చేసే విషయంలో రెండు శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు తెలిపారు.



తుళ్లూరు: హైకోర్టు వైపు నుంచి వీఐటీ యూనివర్సిటీకి వెళ్లే దారి దుస్థితి



తాడేపల్లి రైల్వేగేటు వద్ద అధ్వానంగా..

భయాందోళనగా ఉంది

పెదనందిపాడు నుంచి ద్విచక్ర వాహనంపై రాకపోకలు సాగించాలంటే భయాందోళనకు గురవుతున్నాం. రోడ్డుకు గండ్లు పడి అధ్వానంగా మారింది. పెద్ద వాహనాలు వెళ్లేటప్పుడు ద్విచక్రవాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. పొరపాటున జారి పడితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. మరమ్మతులు చేయించాలని కోరుతున్నాం.
– శివకృష్ణ, పెదనందిపాడు

పరిహారం మంజూరుపై హర్షం



ఆత్మకూరు: సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి చేనేత కార్మికుల క్షీరాభిషేకం

ఆత్మకూరు(మంగళగిరి), న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన చేనేత కార్మికులకు పక్షం రోజుల్లోనే పరిహారాన్ని ఖాతాలకు జమ చేయడంపై మండల ఆత్మకూరులో తెదేపా నాయకులు, చేనేత కార్మికులు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఇందుకు చొరవ చూపిన మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ తెదేపా అధ్యక్షుడు, నాయకులు కొమ్మా సుకుమార్, తాటి గణేష్, మాణిక్యరావు, శివరామకృష్ణ, సుబ్బయ్య, కోటయ్య, రవికుమార్, రామస్వామి, అఖిల్, జనసేన నాయకులు పాల్గొన్నారు. మంగళగిరిలోని పీఎంపేట, ఎన్టీఆర్‌నగర్, రాజీవ్ గృహకల్ప వద్ద చేనేత కార్మికులు చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

ఉత్సాహంగా స్వచ్ఛతే సేవ



తాడేపల్లి: వీధులు శుభ్రం చేస్తున్న నగరపాలక కమిషనర్ అలీంబాషా తదితరులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా నగరపాలక కమిషనర్ అలీంబాషా పర్యవేక్షణలో సిబ్బంది గురువారం తాడేపల్లి బైపాస్ రోడ్డులో వీధులను శుభ్రం చేశారు. కాజ టోల్‌ప్లాజా నుంచి తాడేపల్లి వారధి వరకు ప్రధాన కూడళ్లలో పేరుకుపోయిన చెత్తను ఊడ్చివేశారు. రెండు యంత్రాలతో రోడ్లను శుభ్రపరిచారు. డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లారు.

కంఠంరాజుకొండూరు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: కంఠంరాజుకొండూరులో సర్పంచి ఉన్నం రూప్సీ ఆధ్వర్యంలో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యదర్శి నాగిరెడ్డి, పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడికొండూరు: మండలంలోని యూనివర్సల్ కళాశాల, కేంద్ర యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ, గుంటూరుకు చెందిన నెహ్రూ యువ కేంద్రం, పేస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో పేరేచర్ల కూడలిలో కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. చుట్టు పక్కల ప్లాస్టిక్ వస్తువులు లేకుండా శుభ్రం చేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పామిశెట్టి బాలస్వామి, ప్రిన్సిపల్ కోటిరెడ్డి, పాదర్ అనిల్‌కుమార్, పీడీ మర్రెడ్డి, గ్రామ సర్పంచి దేవరకొండ రాజ్‌కుమార్, పేస్ సొసైటీ కార్యదర్శి పర్వపు రమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రహమాన్ పాల్గొన్నారు.



పేరేచర్ల కూడలిలో కళాశాల విద్యార్థుల ప్రదర్శన

పోషకాహారం తీసుకోండి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం పెదనందిపాడు మండలం కట్రపాడులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. అందరూ పోషకాహారం తీసుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలంటూ నినాదాలు చేశారు.

వరద బాధితులకు చేయూత



దుప్పట్లు, బియ్యం పంపిణీ చేస్తున్న చిన్నజీయర్ స్వామి ఆశ్రమ నిర్వాహకులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: విజయవాడలోని వించిపేట, దాసాంజనేయస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో వరద బాధితులకు తాడేపల్లి పరిధిలోని సీతానగరం చినజీయర్‌స్వామి ఆశ్రమ నిర్వాహకులు బాసటగా నిలిచారు. సుమారు 400 మందికి బియ్యం, దుప్పట్లు అందజేశారు.

చమళ్లమూడి (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: మండలంలో చమళ్లమూడి గ్రామస్థులు విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు రూ.లక్ష మొత్తాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి గురువారం అందించారు. గ్రామ సర్పంచి జటావత్‌దేవి, పంచాయతీ వార్డు సభ్యులు గుండవరపు లక్ష్మణ్, యడ్లపల్లి వాణి, బేతపూడి సుష్మ, జాగర్లమూడి సునీత, ఘంటా శ్రీనివాస్, గ్రామ ప్రముఖులు అరికపూడి పాపారావు, కన్నెగంటి నాగమల్లేశ్వరరావు, వినోద్ జయదీప్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రామాంజనేయులుకు విరాళం మొత్తం అందిస్తున్న చమళ్లమూడి గ్రామస్థులు

రాజధాని నిర్మాణానికి విరాళం

కొండబాలవారిపాలెం(కాకుమాను), న్యూస్‌టుడే: కాకుమాను మండలం కొండబాలవారిపాలెనికి చెందిన గొరిజవోలు సాంబశివరావు, సత్యనారాయణ, నాగరాజకుమారిలు రూ. 2 లక్షల చెక్కును గురువారం సీఎం చంద్రబాబుకు అందజేశారు. వారి తల్లిదండ్రులు గొరిజవోలు సీతారామయ్య, అన్నపూర్ణ పేరు మీద రాజధాని నిర్మాణానికి చెక్కును అందజేసినట్లు తెలిపారు. వారితో పాటు బంధువులు భారతి, పావని, శ్రీహర్ష, గోపిక చంద్రబాబును కలిశారు.



సీఎం చంద్రబాబుకు రూ.2 లక్షల చెక్కు అందజేస్తున్న సాంబశివరావు, నాగరాజకుమారి

దుకాణంలో దొంగతనం

మేడికొండూరు: దుకాణంలో చోరీ జరిగిన ఘటనపై గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మేడికొండూరుకు చెందిన చింతపల్లి మార్కు గ్రామంలో ఎస్‌బీఐకు చెందిన కస్టమర్ సర్వీస్ పాయింట్ నడుపుతుంటారు. బుధవారం సాయంత్రం యథావిధిగా దుకాణం తాళం వేసి ఇంటికి వెళ్లి గురువారం ఉదయం చూడగా తలుపు తెరిచి తాళం పగలకొట్టి ఉంది. గల్లా పెట్టెలో ఉన్న రూ.30 వేలు నగదు, ఒక సెల్‌ఫోన్ మాయమైంది. బాధితుడు మార్కు ఫిర్యాదు మేరకు పోలీసులు, నిపుణులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు.

ఉచితంగా ఇంటర్న్‌షిప్

దుగ్గిరాల: చింతలపూడిలో ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల సింథోక్విస్ట్ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థతో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రధానాచార్యుడు డాక్టర్ ఎస్.వి.పవన్‌కుమార్ గురువారం తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా ఇంటర్న్‌షిప్ కల్పిస్తామని సింథోక్విస్ట్ సాంకేతిక అధికారి రాఘవేంద్ర చెప్పారన్నారు.

ఏవోకు సత్కారం

ప్రత్తిపాడు: ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా 8 ఏళ్లు విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న రామకోటయ్యను ఎంపీపీ దాసరి అన్నమ్మ, ఎంపీడీవో శివపార్వతి, పంచాయతీ కార్యదర్శులు గురువారం సత్కరించారు. సీనియర్ అసిస్టెంటు ఝాన్సీని సత్కరించారు.

జ్వరాలపై సర్వే

తాడేపల్లి: తాడేపల్లిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన సిబ్బంది మహానాడు కట్ట, నులకపేట, ఆర్‌ఎంఎస్ కాలనీల్లో సర్వే నిర్వహించారు. ప్రత్యేక బృందంలో డాక్టర్ హేమ, అసిస్టెంట్ ప్రొఫెసర్ గీతాకల్యాణ్, సుబ్బరాయనం, జిల్లా మలేరియా అధికారి వరప్రసాద్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు కొత్త భవనం

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: వట్టిచెరుకూరులో అధునాతన హంగులతో కొత్త పోలీస్‌స్టేషన్ నిర్మించనున్నట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం ఇక్కడ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామం మధ్యలో స్టేషన్ ఉండడంతో వాహనాల రాకపోకల సమయంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని స్థానికులు ఎస్పీకి వివరించారు. గ్రామం వెలుపల సచివాలయం పక్కన పోలీస్‌స్టేషన్ నిర్మించే అంశంపై ఆలోచనలు చేస్తామని చెప్పారు. ఎస్ఐ సుబ్బారావు ఎస్పీ స్టేషన్‌ను సందర్శించిన సమయంలో స్టేషన్‌లో ఉన్నారు.

సైబర్ క్రైమ్ పోలీసులతో మాట్లాడతా: ఎస్సై

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ఈమని యువకుని బెదిరించి సైబర్ నేరగాళ్లు రూ.19.8 లక్షలు లాగేసిన కేసులో సైబర్‌క్రైమ్ పోలీసులు, సాంకేతిక సిబ్బందితోనూ మాట్లాడతానని ఎస్సై వెంకటరవి గురువారం తెలిపారు. యువకుడు ముదిగొండ వంశీ జ్వాలా రామలింగేశ్వర్ మోసపోయిన ఘటనపై 'కేసులో ఇరికిస్తామని.. రూ.19.80 లక్షలు కొట్టేసి' శీర్షికన గురువారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన సంగతి తెల్సిందే. సాంకేతికంగా అతని ఖాతాలు సైబర్ పోలీసులు పరిశీలించి ఉంటారని, ఏమైనా నగదు వెనక్కు వచ్చే విషయంపై ఉన్న అవకాశాన్ని అడిగి తెలుసుకుంటానని అన్నారు.

ఫిరంగిపురం ఈవోగా శ్రీనివాసరావు

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండల దేవాదాయ శాఖ అధికారిగా జక్కా శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన రామిరెడ్డి పల్నాడు జిల్లా రెంటచింతల బదిలీ అయ్యారు. తెనాలి డివిజన్ ఈమని ఈవోగా పని చేస్తున్న శ్రీనివాసరావు బదిలీపై ఫిరంగిపురం వచ్చారు.

ఇసుక లారీ స్వాధీనం

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీని మంగళవారం రాత్రి తుళ్లూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉద్దండరాయునిపాలెంకు చెందిన మణికంఠ చెందిన లారీలో అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు పోలీసులు తనిఖీలో గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే ఉద్దండరాయునిపాలెం సమీపంలో మట్టిని తవ్వుతున్న మరో పొక్లెయిన్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఈదులపాలెం(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: ప్రత్యేక మొబైల్ మెడికల్ హాస్పిటల్ ద్వారా తుళ్లూరు మండలం వెలగపూడిలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు కాటూరి వైద్య కళాశాల డీన్ వరప్రసాద్ చెప్పారు. మొబైల్ మెడికల్ హాస్పిటల్ వాహనాన్ని కాటూరి వైద్య కళాశాల డైరెక్టర్ వైద్యులు స్వైరా ప్రారంభించారు. 503 మందికి వైద్యసేవలు, పరీక్షల అనంతరం 133 మందిని మెరుగైన వైద్యం కోసం కాటూరి వైద్యశాలకు రిఫర్ చేసినట్లు తెలిపారు. తెదేపా నాయకులు వెంకటేశ్వరరావు, నరేంద్ర, హసన్ భాషా, తదితరులు పాల్గొన్నారు.



ఓపీ నమోదు చేయించుకుంటున్న ప్రజలు

ఉచిత కంటి వైద్య శిబిరం 29న

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అశోక పాఠశాలలో ఈ నెల 29న ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకూ నర్రా సుబ్బరామయ్య పేరిట నగరాజకుమారి, బాలకృష్ణల సౌజన్యంతో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.శివప్రసాద్, ఎన్.వెంకటశివ నాగేశ్వరరావు తెలిపారు.

రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చేందుకు లోకేశ్ కృషి



ప్రాతూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనురాధ

తాడేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గురువారం మండలం ప్రాతూరులో అదనపు కమిషనర్ శకుంతల అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ అనురాధ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కుంచనపల్లి, గుండిమెడ, మెల్లెంపూడి గ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. * నేతన్నలకు అండగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ పద్మశాలీయ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువు ప్రాంతంలో భావనారుషి స్వామి వారి ఆలయాన్ని ఆయన సందర్శించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోటా పార్థసారథి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామర్ల రాజు, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, తదితరులు అబద్దయ్యను సత్కరించారు.



గొట్టిపాడు: మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గొట్టిపాడు(ప్రత్తిపాడు): రాష్ట్రంలో అక్టోబరు 2 తర్వాత పాలనను మరింత వేగంగా పరుగులు పెట్టిస్తామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రత్తిపాడు మండలం గొట్టిపాడులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఓ వ్యక్తి తన గురించి అసభ్యంగా పోస్టు పెట్టారని, అలాంటి వాటిని తాను పట్టించుకోనని తెలిపారు. ఏటా గొట్టిపాడు గ్రామానికి రూ.కోటి రూపాయలతో అభివృద్ధి పనులు చేసేలా చూస్తామని చెప్పారు. పాత మద్రాసురోడ్డు 6 వరుసల రోడ్డుగా విస్తరించేందుకు ప్రతిపాదనలు రూపొందించామని తెలిపారు.

తుళ్లూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో వరదలు వస్తే మాజీ ముఖ్యమంత్రి జగన్ హెలీకాప్టర్‌లో వచ్చి రెడ్‌కార్పెట్‌పై తిరుగుతూ ప్రజలకు చేతులు ఊపి వెళ్లేవారని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ విమర్శించారు. పెదపరిమి గ్రామ పంచాయతీలో సభలో ఆయన మాట్లాడుతూ ఇటీవల విజయవాడకు వరదొస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు 10 రోజులు ఆ ప్రాంతంలోనే ఉంటూ బాధితులకు పూర్తి అండగా నిలిచి సాయం మంజూరు చేశారని అన్నారు. తెదేపా నాయకులు పుట్టి రామచంద్రరావు, నూతలపాటి రామారావు, ధనేకుల వెంకట సుబ్బారావు, కంతేటి బ్రహ్మయ్య, స్థానికులు పాల్గొన్నారు.



తుళ్లూరు: పెదపరిమిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

ముట్లూరు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: వట్టిచెరుకూరు మండలంలోని ముట్లూరులో కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.



ముట్లూరులో ..

ముగిసిన ఆటల పోటీలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు బీవీఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 3 రోజులపాటు జరిగిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు గురువారం ముగిశాయి. గురువారం అండర్-14, 17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ బాల, బాలికలకు వేర్వేరుగా నిర్వహించినట్లు సమన్వయకర్త డేవిడ్ రాజ్‌కుమార్ చెప్పారు. యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేసినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో జడ్పీటీసీ సభ్యులు విప్పాల కృష్ణారెడ్డి మాట్లాడారు. పోటీలను విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, పీఈటీలకు, ప్రత్తిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. విజేతలను అభినందించారు.

మొక్కలు నాటి పర్యావరణం కాపాడాలి

యనమదల(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: విద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఏపీ జీవవైవిధ్య బోర్డు సమన్వయకర్త గాలిబ్ అన్నారు. రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు సెంటేనియల్, ఏపీ జీవవైవిధ్య బోర్డు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు మండలం యనమదల జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో.. మొక్కలు నాటడం సామాజిక బాధ్యత అని చెప్పారు. రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు సెంటేనియల్ అధ్యక్షులు బాల సుబ్రహ్మణ్యం, కార్యదర్శి నవీన్ చక్రవర్తి, డాక్టర్ సుధాకర్, కందిమళ్ల స్వప్న, సర్పంచి ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి శివాజీ, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు



తాడికొండ: ఎలక్ట్రికల్ షాపులో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ ప్రాంతంలో కొద్ది రోజులుగా జరుగుతున్న చోరీలపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు నిర్మాణంలో ఉన్న విల్లాస్, హార్డ్‌వేర్ షాపుల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. దీంతో వ్యాపారులు, బిల్డర్లు బెంబేలెత్తిపోతున్నారు.

❖ తాడికొండ అడ్డరోడ్డు ఢిల్లీ పబ్లిక్ పాఠశాలకు సమీపంలో నూతనంగా పీఎస్ఆర్ గ్రీన్‌సిటీ నిర్మాణం జరుగుతోంది. విల్లాస్‌లో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రూ.10 లక్షల విలువైన విద్యుత్తు సామగ్రి చోరీ చేసినట్లు బిల్డర్ తాడికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 21, 22వ తేదీలు శని, ఆదివారాలు కావడంతో విల్లాస్‌లో కార్మికులు ఎవరూ పనికి రాలేదు. బిల్డర్ సైతం ఇంటి వద్దనే ఉండిపోయారు. సూపర్‌వైజర్ మల్లేశ్వరరావుతో పాటు జైపాల్, నానిలు అక్కడే ఉన్నారు. సోమవారం ఉదయం సైట్ వద్దకు వచ్చి స్టోర్ రూమ్‌ను చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. స్టోర్ రూమ్‌లో భద్రపర్చిన 30 విద్యుత్తు తీగల బాక్సులు, ఓ ఫోన్ కనపడలేదు.

❖ సెప్టెంబర్ 5వ తేదీన తాడికొండ అడ్డరోడ్డు సమీపంలో రూ.లక్ష నగదు, రూ.7.50 లక్షలు విలువైన సామగ్రి చోరీ అయ్యాయని షాపు యజమాని తుమ్మల గోపిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

❖ మోతడకలో కాకతీయ కన్వెన్షన్ సొసైటీలో సెప్టెంబర్ 12న రాత్రి నిర్మాణంలో ఉన్న వృద్ధాశ్రమంలో రూ.లక్షన్నర విలువైన విద్యుత్తు సామగ్రి, ఇద్దరు వర్కర్ల ఫోన్లు మాయమయ్యాయి.

❖ చోరీలు జరిగిన ప్రాంతంతో పాటు చుట్టు పక్కల నిఘా నేత్రాలు లేవని, గ్రామ శివారుల్లో వ్యాపారాలు చేసేవారు, వెంచర్ల నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ వాసు సూచించారు.

తెనాలి

•తెనాలి •పొన్నూరు

నర్సుల ఆందోళనకు మద్దతు



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు ముత్యాలరావు, నేతాజీ

గుంటూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నేతాజీ అన్నారు. గురువారం ఆసుపత్రిలో నర్సులు ఆందోళన శిబిరానికి సీఐటీయూ నాయకులు వెళ్లారు. వారి ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణరావు, ముత్యాలరావు పాల్గొన్నారు.

తాగునీటి పథకాలకు రూ.17.68 కోట్లు మంజూరు



మాట్లాడుతున్న కమిషనర్ రమేషుబాబు

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ రూ.17.68 కోట్లు నిధులు మంజూరు చేయించారని పురపాలక సంఘ కమిషనర్ రమేషుబాబు తెలిపారు. గురువారం పట్టణ పరిధిలోని 25, 27, 28 వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని వెల్లడించారు. అంతకుముందు పట్టణంలో తాగునీటి సరఫరాను ఆయన పరిశీలించి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. 25వ వార్డులో వంతెన మరమ్మతుల పనులను పరిశీలించారు. పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

నాన్ లీనియర్ విశ్లేషణతో నూతన ఆవిష్కరణలు



సంచిక విడుదల చేస్తున్న బోరినా శాంటో బెనర్జీ, లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

పొన్నూరు, న్యూస్‌టుడే: నాన్ లీనియర్ అనాలిసిస్‌తో కల్పితాలను సరికొత్త ఆవిష్కరణలకు వీలవుతుందని ఇటలీలోని పాలిటెక్నిక్ డి బోరినా శాంటో బెనర్జీ పేర్కొన్నారు. గురువారం విజ్ఞాన్ యూనివర్సిటీలో నాన్ లీనియర్ అనాలిసిస్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్(ఐసీఎన్ఏఎస్సీ) అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్ లీనియర్ విశ్లేషణ ఇంజినీరింగ్ సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతుందన్నారు. లీనియర్ పద్ధతులతో పరిష్కారం కాని సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించడానికి ఇది సహకరిస్తుందన్నారు. విద్యార్థులు కృత్రిమమేధ, ఐవోటీ, డేటా సైన్స్ తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఐసీఎన్ఏఎస్సీ-2024 సంబంధించిన సంచికను శాంటో బెనర్జీ, విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఉపకులపతి పి.నాగభూషణ్ విడుదల చేశారు.

వీరరాఘవాచార్యులు సేవలు శ్లాఘనీయం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కొండూరు వీర రాఘవాచార్యులు సేవలు శ్లాఘనీయమని విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆరికట్ల గోవర్ధనశాస్త్రి పేర్కొన్నారు. గురువారం స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వీరరాఘవాచార్యుల జయంతి సభలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమానికి ఆలపాటి కళావతి రవీంద్ర పీఠం అధ్యక్షులు అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ ఏడాదికి వీరరాఘవాచార్యుల పేరున విజయవాడకు చెందిన ప్రముఖ చిత్రకారులు పాపులూరి చిదంబరేశ్వరరావును పురస్కారంతో సత్కరించారు. విశిష్ట ప్రధానోపాధ్యాయుడు ఈ.ఎల్.వి. అప్పారావు కార్యక్రమానికి స్వాగతం పలికారు. రవీంద్ర పీఠం శాశ్వత సభ్యులు పావులూరి శ్రీనివాసరావు, అత్తలూరి రాజేశ్వరి, సామ్రాజ్య లక్ష్మి, శోభాదేవి, స్వరాజ్యలక్ష్మి, శ్రీదేవి, శిల్పకారుడు కాటూరు వెంకటేశ్వరరావు, మల్లికార్జున రావు, కేశవరావు, జి.వి.ఆచారి, గ్రంథాలయ అధికారిణి కావూరి రమాదేవి పాల్గొన్నారు.

తాగునీటి కాలుష్యాన్ని కట్టడి చేద్దాం



నిడుబ్రోలులో ప్రమాదకరంగా పిట్ వాల్వు

పొన్నూరు, న్యూస్‌టుడే

✤ పట్టణం	:	పొన్నూరు
✤ వార్డులు	:	31
✤ కుటుంబాలు	:	18,005
✤ జనాభా	:	61,500
✤ పిట్ వాల్వుల సంఖ్య	:	35
✤ కుళాయిల సంఖ్య	:	5,500

వైకాపా పాలనలో ప్రజా సమస్యల పరిష్కారం మాటలకే పరిమితమైంది. పొన్నూరు పట్టణ పరిధిలోని జీబీసీ రహదారి, ఎస్‌పీపీ రోడ్డు, పాత పొన్నూరు, సాయినగర్, నిడుబ్రోలు, పీబీఎన్ కళాశాల రోడ్డు తదితర ప్రాంతాల్లో పిట్ వాల్వులను ఏర్పాటు చేశారు. మంచినీటి సరఫరా చేసే సమయంలో ఒక్కొక్కసారి పైపులైను లీకులు ఏర్పడతాయి. లీకు ఏర్పడిన ప్రాంతంలో మరమ్మతులు చేపట్టాలంటే పిట్ వాల్వు వద్ద నీటి సరఫరాను నిలిపి వేస్తున్నారు. మరమ్మతుల ప్రక్రియ పూర్తికాగానే వాల్వు వద్దకు వెళ్లి యథావిధిగా నీటి సరఫరా చేస్తారు.

పొంచి ఉన్న ప్రమాదం

గతంలో పిట్ వాల్వు నిర్మించిన సమయంలో రహదారి కంటే ఇవి ఎత్తుగా ఉన్నాయి. కాలక్రమేణా నూతన సిమెంటు రహదారులు నిర్మించారు. కొన్ని ప్రాంతాల్లో ఇవి రహదారికి సమాంతరంగా ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో రోడ్డు కంటే దిగువకు ఉన్నాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు నీరంతా తక్కువ ఎత్తులో ఉన్న పిట్ వాల్వులోకి చేరుతోంది. ఎక్కడైనా పైపులైనుకు లీకు ఏర్పడితే మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం పొంచి ఉండడంతో పుర ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వైకాపా పాలనలో పైసా ఇవ్వలేదు

ఆ పిట్ వాల్వులపై ఏర్పాటు చేసిన బండలు సైతం దెబ్బతిన్నాయి. కొన్ని విరిగిపోయాయి. బండలు సరిగా లేకపోవడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని పురప్రజలు భయపడుతున్నారు. ఇంజినీరింగ్ శాఖ సిబ్బంది తాత్కాలికంగా ఏదో ఒక వస్తువును అడ్డం పెట్టి కాలక్షేపం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని పిట్ వాల్వు గోడలు ఎత్తు పెంచడంతోపాటు వాటిపై బండలు ఏర్పాటు చేయాలి. వైకాపా పాలనలో వీటి రక్షణ కోసం నిధులు కేటాయించమని అనేకసార్లు స్థానికులు కోరినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మరమ్మతుల కోసం పైసా నిధులు కేటాయించలేదు. కూటమి ప్రభుత్వమైన జోక్యం చేసుకుని నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



పీబీఎన్ కళాశాల రోడ్డులో ఇలా..

రక్షణ చర్యలు తీసుకుంటాం

దీనిపై పురపాలక సంఘ డీఈ ఏడుకొండలును న్యూస్‌టుడే వివరణ కోరగా పిట్ వాల్వులను పరిశీలించి, రక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చేబ్రోలు ఎంపీడీవోగా లలిత

చేబ్రోలు, న్యూస్‌టుడే: చేబ్రోలు ఎంపీడీవోగా లలిత గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన బాబూరావు బాపట్లకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న లలిత ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యాదర్శులు ఆమెకు అభినందనలు తెలిపారు.



ఎంపీడీవోకు అభినందనలు తెలుపుతున్న కార్యాలయ సిబ్బంది

రేపు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం



ఈనాడు మీతోడు

ఈనెల 28వ తేదీ శనివారం ఈనాడు ఆధ్వర్యంలో 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం' కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో **ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్** పాల్గొని ప్రయాణికులు ప్రస్తావించే సమస్యలకు సమాధానాలు ఇస్తారు. ప్రయాణికులు ఫోన్ చేసి తెనాలి డిపో పరిధిలో బస్సుల రాకపోకలు, ఇతర సమస్యలను ప్రస్తావించొచ్చు. సూచనలు, సలహాలు తెలియజేయొచ్చు.

ఫోన్ చేయాల్సిన సమయం:
ఉదయం 10 నుంచి 11 గంటల వరకు.
ఫోన్ చేయాల్సిన నంబర్లు:
9959225422, 8008573125.

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

అనధికార ఫ్లెక్సీల ప్రదర్శన నిషేధం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: మున్సిపల్ కమిషనర్ అనుమతి లేకుండా పట్టణంలోని ముఖ్య ప్రదేశాలు, కూడళ్లు, డివైడర్లు, ప్రభుత్వ భవనాలపై ఫ్లెక్సీలు, బ్యానర్లు ప్రదర్శించడాన్ని నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా పుర ప్రజలు, వ్యాపార సంస్థలు, రాజకీయ పార్టీల వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వాన నీరు కదలకే ముంపు



విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న ఛైర్‌పర్సన్ రాధిక

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: కాలువలు శుభ్రం చేయక పోవడంతో వాననీరు ముందుకు కదలక ఇళ్లల్లోకి వచ్చాయని 19వ వార్డు వాసులు ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న దృష్టికి తీసుకొచ్చారు. వీరు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం సందర్భంగా 18, 19, 29 వార్డుల్లో పర్యటించారు. వాన నీరు బయటకు మళ్లించక రోడ్డుపై నిలిచి ఇబ్బందిగా ఉందని 29 వార్డు వాసులు వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆ వార్డుల్లో అవగాహన ప్రదర్శన నిర్వహించి, పాఠశాల విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఆరోగ్యాధికారి కె.హెలెన్ నిర్మల, ఎంఈ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయాల ఉద్యోగులు, నగరదీపికలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

✤ స్వర్ణాంధ్ర-2047 సాకారం చేసుకుందామని మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పిలుపునిచ్చారు. గురువారం 20 నుంచి 40 వార్డుల్లో స్వర్ణాంధ్ర-2047పై సభలు నిర్వహించారు. విద్యుత్తు బిల్లు ఎక్కువ వచ్చిందని పింఛన్ తొలగించారని, కుళాయి కనెక్షన్లు ఇప్పించాలని, మురుగు ముందుకు కదలక దోమకాటు పెరిగిందని తదితర పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం చూపాలని కోరారు.

ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ తరగతులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: దసరా సెలవుల సందర్భంగా స్టెప్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెనాలి సమన్వయకర్త తన్నీరు శివశంకర్ గురువారం తెలిపారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రభాకర్ సుబ్బారావు విద్యార్థుల్లో లోపాలను గుర్తించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపే అంశాలపై శిక్షణ ఇస్తారని వెల్లడించారు. తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామంలోని ధ్యాన మందిరం వేదికగా అక్టోబరు 4, 5, 6 తేదీల్లో శిక్షణ ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్ఫూర్తి ప్రదాత ఐలమ్మ

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: వీరనారి ఐలమ్మ స్ఫూర్తి ప్రదాత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెదేపా, బీసీ సంక్షేమ సంఘం, రజక సోదరుల ఆధ్వర్యంలో వేర్వేరుగా గురువారం పట్టణంలోని ఐలమ్మ మున్సిపల్ పార్కులోని ఆమె విగ్రహం వద్ద జయంతి నిర్వహించారు. తరవాత వారు ఆమె విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, జొన్నాదుల మహేష్, కౌన్సిలర్లు పసుపులేటి త్రిమూర్తి, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, సహాయ కమిషనర్ వల్లూరు లక్ష్మీపతి రావు, కొడాలి సుబ్రహ్మణ్యం, మునిపల్లి రామకృష్ణ, చాట్రగడ్డ ఆంజనేయులు, కావేటి వేణు, మునగా నరసింహా తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు 29వ వార్డు ప్రధాన రహదారిలో చెత్తను తొలగించలేదు. దుర్వాసన వస్తోంది. **- పి.కిరణ్, 29వ వార్డు.**

✔ చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటా. **- శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి**

? నేతాజీనగర్‌లోని మురుగుకాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. **- కె.శ్రీధర్‌బాబు, నేతాజీనగర్**

✔ వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటా. **- శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి**

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

మేమున్నాం... మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి ప్రజారోగ్యశాఖాధికారులు స్పందించారు. పాత పొన్నూరులో ప్రధాన మురుగుకాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. పట్టణ నాజరుపేట కుక్కల వారి వీధిలో వ్యర్థాలు తొలగించ లేదని, నందులపేట యడ్లపాటి వెంకట్రావు బజారులో మురుగు కాలువల్లో పారుదల లేదని స్థానికులు 'ఈనాడు' ద్వారా ఈనెల 24న మున్సిపల్ అధికారులకు సమస్యలను తెలియచేయగా సిబ్బంది వాటిని పరిష్కరించారు.

? తెనాలి వహాబ్‌రోడ్డు కామేశ్వరరావు వీధిలో రోడ్డు వెంట వ్యర్థాలను పది రోజులుగా తొలగించ లేదు. **- శంకర్, వహాబ్‌రోడ్డు**

✔ తొలగింపు చేస్తాం. స్థానిక సిబ్బందితో మాట్లాడతాను.

? పట్టణ నందులపేట వజ్రాల వారి వీధి, ఉడా కాలనీ కోగంటి తాతయ్య వీధి వెనుక నివాస గృహాల నడుమ నిర్వహణ లేని ఖాళీ స్థలాల్లో పిచ్చి పొదలు పెరిగి వాటిల్లో పాములు, పురుగులు చేరి ఇళ్లల్లోకి వస్తున్నాయి. భయంభయంగా ఉండాల్సి వస్తుంది. **- స్థానికులు, నందులపేట, ఉడా కాలనీ**

✔ సంబంధిత స్థలాల యజమానులతో మాట్లాడి సమస్య పరిష్కార చర్యలు తీసుకుంటాం. **- పై ప్రశ్నలకు తెనాలి పురపాలక సంఘ కమిషనర్ బి.శేషన్న సమాధానాలు ఇచ్చారు.**

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్, పొన్నూరు

ప్రతి రైతుకు నష్ట పరిహారం



మాట్లాడుతున్న తెదేపా నేతలు

పొన్నూరు, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం పరిహారం అందచేసిందని పొన్నూరు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాదాల వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం పొన్నూరు తెదేపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం పరిహారం అందించిందన్నారు. పొన్నూరులో 5026 మంది రైతుల ఖాతాలో రూ.8.20 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వం మాటలతోనే రైతులను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో తెదేపా నేతలు బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, వెంకట్రావు, బిరయ్య, వెంకట ధర్మారావు, రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీలో స్వర్ణాంధ్ర-2047 అభిప్రాయ సేకరణ

పెదకాకాని, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047పై నంబూరు వీవీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా విద్య నైపుణ్యం అనే అంశంపై 27 నుంచి 29 వరకు కళాశాలలో పలు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రణాళికా విభాగం అధికారి పోలయ్య కరపత్రాలను విడుదల చేశారు. పోలయ్య మాట్లాడుతూ ప్రణాళికలపై విద్యార్థులు తమ అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. క్యూఆర్ కోడ్‌ను ఫోన్ ద్వారా స్కాన్ చేసి తమ అభిప్రాయాలు వెల్లడించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం



బహుమతులు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో గురువారం ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటరమణ వైద్యరంగంలో ఫార్మసిస్టుల ప్రాముఖ్యతను వివరించారు. ఫార్మసీ, ఫార్మా డీ విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ కోటిరెడ్డి, నందగోపాలకృష్ణ, భార్గవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌలు రైతులను విస్మరించిన ప్రభుత్వం



రైతు సంఘం నాయకుల నిరసన

కొల్లిపర, న్యూస్‌టుడే: వరద ముంపు బాధిత రైతులకు పూర్తి నష్ట పరిహారం అందించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య కోరారు. గురువారం కొల్లిపర మండల పరిధిలోని ముంపు గ్రామాల్లో పర్యటించిన అనంతరం కొల్లిపర తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. వరిసాగు చేపట్టిన రైతులకు ఎకరాకు రూ.25వేలు, ఉద్యాన పంటల రైతులకు ఎకరాకు రూ.50 వేలు ప్రభుత్వం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను ప్రభుత్వం విస్మరించిందని, భూస్వాముల అనుమతి లేకుండా పరిహారం పంపిణీ చేయాలన్నారు. స్మార్టు మీటర్లను రద్దుచేయాలన్నారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందచేశారు. నాయకులు ఎం.హరిబాబు, భైరా శ్రీనివాసరావు, ములకా శివసాంబిరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి



నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయుకులు, కార్మికులు

పొన్నూరు, న్యూస్‌టుడే: పౌర సరఫరాల శాఖలో పనిచేస్తున్న హమాలీలకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు కోరారు. గురువారం నిడుబ్రోలు పౌరసరఫరాల శాఖ గోదాములో నేత్రాలకు నల్ల రిబ్బన్లు కట్టుకుని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈఎస్ఐ లేకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2024 జనవరి నుంచి కూలి రేట్లు పెంచాల్సి ఉండగా, వైకాపా ప్రభుత్వం పెంచలేదని, కూటమి ప్రభుత్వమైనా పెంచాలని కోరారు.

నివాస గృహాల నడుమ వ్యర్థాల గుట్టలు



పట్టణ బుర్రిపాలెం రోడ్డు పాలాద్రి కాలువ వెంట నివాస గృహాల నడుమ ఎక్కడెక్కడి నుంచో చెత్తను తెచ్చి అటు ప్రయివేటు, ఇటు మున్సిపల్ సిబ్బంది గుట్టలుగా పడేశారు. వ్యర్థాల గుట్టలతో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఇటీవల దానిలో సగం తరలించారు. మిగిలిన సగం ఇలా వదిలేశారు. ఈ తీరుతో దోమలు, దుర్వాసనతో పాటు రాకపోకలకు సైతం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

దృష్టి పెడితే సుందర దృశ్యమే

పట్టణ చినరావూరు పార్కు కూడలిలోని ఫౌంటెన్‌తో కూడిన నిర్మాణం నిర్వహణ లోపాలతో దుర్భరంగా ఉంది. చుట్టూ ఉన్న రాళ్లు పడిపోయి, లోపల పిచ్చి మొక్కలు, చుట్టూ గోడ పత్రికలతో అందవిహీనంగా ఉంది. లోపలి నీటి ఫౌంటెన్లు కూడా పనిచేయడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి మరమ్మతులు పూర్తి చేస్తే విద్యుత్తు వెలుగుల్లో నీటి ధారలతో కూడిన ఫౌంటెన్ ఈ ప్రాంతం మీదుగా పయనించే వారికి కనుల విందు చేస్తుంది. సుందర దృశ్యం ఆవిష్కృతమవుతుంది. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**



నిరుపయోగంగా పడి ఉన్న ఫౌంటెన్

నాజరుపేటలో ఇరు వర్గాల ఘర్షణ

ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన సుబ్బారావు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ నాజరుపేటలో తిరుపతమ్మ గుడి చెంతనే కృష్ణుడి గుడి పునర్నిర్మాణం చేపట్టిన క్రమంలో ఇరు ఆలయాల పర్యవేక్షకుల నడుమ గురువారం ఘర్షణ జరిగింది. తండ్రీకుమారులైన మహేష్, నరసింహారావు, వారి కుటుంబ సభ్యులు కత్తి, ఇటుకరాళ్లతో దాడి చేయడంతో తాము గాయపడినట్లు సుబ్బారావు, అతని అన్న వెంకటనరసింహారావు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కొడుతూ ఉండగా అడ్డు వచ్చిన 80 సంవత్సరాల వృద్ధురాలైన తమ తల్లి రాధారుక్మిణిపై సైతం దాడి చేసినట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనలో తల పగిలి తీవ్రంగా గాయపడిన సుబ్బారావు పట్టణంలోని ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. గొడవ విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది. బాధితులు చికిత్స పొందుతున్న వైద్యశాల వద్దకు పెద్ద సంఖ్యలో స్థానికులు చేరారు.

సగం సగం పనులు..ప్రజలకు ఇబ్బందులు

దర్పణం



పట్టణ సుల్తానాబాద్ ప్రాంతంలోని ఆలపాటినగర్ నుంచి యడ్లపల్లి వెళ్లే రోడ్డును గతంలో సగం వేసి వదిలేశారు. మిగిలిన సగం ఇలా గుంతలతో రాకపోకలకు ఏమాత్రం అనువుగా లేదు. ఇది రద్దీ అధికంగా ఉండే మార్గం. నివాస సముదాయాలు కూడా ఎక్కువే. ప్రధాన మార్గం ఇలా ఉండడంతో ప్రజల ఇబ్బందులు కొనసాగుతున్నాయి. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

29న సంగీత విభావరి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శుభాంజలి కళావేదిక సంస్థ అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ ఆధ్వర్యంలో 'గాన గంధర్వుడు ఎస్పీ బాలు ఆణిముత్యాలు' పేరున సంగీత విభావరి ఆదివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నామని నిర్వాహకుడు చీకటి రవికాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ప్రత్యేకంగా బాలు 1970 నుంచి 1980 మధ్య పాడిన మధుర గీతాలను కళాకారులు ఆలపిస్తారన్నారు.

అసభ్య ప్రవర్తనపై ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తాను ఇంట్లో నిద్రపోతూ ఉండగా గుర్తు తెలియని వ్యక్తి లోపలకు వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడని పట్టణంలోని ముత్తంశెట్టివారిపాలెంకు చెందిన 50 సంవత్సరాల మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

విప్లవ కెరటం ఐలమ్మ



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: చీకటిలో నలుగుతున్న బతుకులకు వెలుగు దారి చూపిన విప్లవ కెరటం ఐలమ్మ అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు ఐలమ్మ జయంతి గురువారం నిర్వహించారు. చంద్రమౌళీనగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే మాధవితో పాటు ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, ప్రధాన కార్యదర్శి నాగ మల్లేశ్వరరావు, తెదేపా జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్‌లు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ రైతాంగ పోరాట యోధురాలు ఐలమ్మ ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ దొరతనాన్ని ఎదిరించి, భూస్వాములపై గర్జించిన ఆమె తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిప్పుకణికగా నిలిచారన్నారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన యోధురాలు ఐలమ్మ అని కొనియాడారు.

గుంటూరు తూర్పు



7ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 35, వంగ 38, బెండ 35, పచ్చి మిర్చి 18, కాకర 38, క్యారెట్ 48, క్యాలీఫ్లవర్ 34, క్యాబేజీ 24, బీర 24, దొండ 39 బంగాళదుంప 39, ఉల్లిపాయలు 55, గోరుచిక్కుళ్లు 34, దోస 24, పొట్ల 30, మునగ 6, పెద్ద చిక్కుళ్లు 34, చామదుంప 38, మునగ రూ.6, గోంగూర 8, తోటకూర 10, కొత్తిమీర 50, బీట్‌రూట్ 32, కీర 34, క్యాప్సికం 64, అల్లం 95, ఫ్రెంచి బీన్స్ 55, సొర 10, అరటి 7, -న్యూస్‌టుడే, పట్నంబజారు

పేదరికం లేని రాష్ట్రమే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: వంద రోజుల చంద్రబాబు పాలన రాబోయే అయిదు సంవత్సరాలకు సూచిక లాంటిదని ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. మూడో డివిజన్‌లో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ.. పేదరికం లేని రాష్ట్రం తీర్చిదిద్దాలనేది చంద్రబాబు లక్ష్యమని చెప్పారు. బాబు చేస్తున్న మంచి పనులతో వైకాపా పార్టీ ఉనికి ప్రశ్నార్థకమైందన్నారు. తెదేపా నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ మాట్లాడుతూ.. సంపద సృష్టించడం, పేదలకు పంచడం చంద్రబాబు వల్లే సాధ్యమవుతుందని కొనియాడారు. జగన్ కుట్రలు, కుతంత్రాలు ఇకపై సాగనివ్వబోమని హెచ్చరించారు. డిప్యూటీ మేయర్ సజీల, నాయకులు ఎల్లావుల అశోక్, వెంకటకృష్ణ, రాజా, మాదాసు శేఖర్, బాజి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు



నెహ్రూనగర్, న్యూస్‌టుడే : దేవాదాయశాఖకు చెందిన లాలాపేటకు చెందిన వెంకటేశ్వరస్వామి ఆలయం, కొత్తపేట జగన్నాథస్వామి దేవస్థానం, నాజ్‌కూడలిలోని ఆంజనేయస్వామి ఆలయం హుండీలను ఆశాఖ సహాయ కమిషనర్ దివి శ్రీనివాసరావు, ఈవో శ్రీనివాస్ పర్యవేక్షణలో గురువారం తెరిచి లెక్కించారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.4,25,559, కొత్తపేట జగన్నాథస్వామి దేవస్థానంలో రూ.8,464, ఆంజనేయస్వామి ఆలయంలో రూ.3,01,469 ఆదాయం వచ్చిందని ఏసీ దివి శ్రీనివాసరావు తెలిపారు.

నర్సుల ఆందోళనకు మద్దతు


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు ముత్యాలరావు, నేతాజీ

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. గురువారం ఆసుపత్రిలో నర్సులు ఆందోళన శిబిరానికి సీఐటీయూ నాయకులు వెళ్లారు. వారి ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణరావు, ముత్యాలరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. వాహనాల వద్దే చతికిల

వెహికల్ షెడ్డు నిర్వహణ గాలికొదిలేసిన ఫలితం

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే

ప్రజారోగ్యానికి పారిశుద్ధ్య నిర్వహణ అత్యంత కీలకం. గుంటూరు నగరపాలక సంస్థ స్వచ్ఛ గుంటూరు, పచ్చదనం- పరిశుభ్రత, స్వచ్ఛతాహీ సేవ తదితర అనేక కార్యక్రమాలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఫలితాలు కనిపించడం లేదు. బ్లాక్ స్పాట్ల నుంచి వీధుల్లో పోగయ్యే చెత్త తరలించేందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు వాహనాలు ఇవ్వాల్సి ఉన్నా.. ఇంజినీరింగ్ విభాగం పట్టించుకోవడం లేదు. శానిటరీ సూపర్వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు అడిగితే వెహికల్ షెడ్ ఏఈ స్పందిస్తున్న దాఖలా లేదు. ఉన్నతాధికారులు మాత్రం విభాగాల మధ్య సమన్వయం ఉండాలని, అవసరం మేరకు వాహనాలు వినియోగించి పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నా పట్టించుకున్నది లేదు.


తుక్కుగా మారిన డంపర్‌బిన్లు, డంపర్ ప్లేసర్లు

వీధుల్లో చెత్త తరలించే వాహనాలు	164
వినియోగంలో ఉన్నవి	70
మరమ్మతుకు గురైనవి	18
కాలం చెల్లినవి	76
నగరంలో రోజుకు వచ్చే చెత్త	420 మెట్రిక్ టన్నులు


షెడ్డులోని కాంపాక్టర్ వాహనాలు

ఈ-ఆటోలు వందశాతం తిరిగితేనే..

నగరానికి వైకాపా ప్రభుత్వ హయాంలో ఇచ్చిన 220 ఈ-ఆటోల్లో వంద కూడా పని చేస్తున్న దాఖలాలేదు. పాడై పోవడంతో వాటిని వెహికల్ షెడ్‌లోనే ఉంచారు. దీంతో ఇంటింటి చెత్త సేకరణ తోపుడు బండ్లతోనే చేస్తున్నారు. ఈ-ఆటోల నిర్వహణకు నియమించిన ఏజన్సీ పట్టించుకోక పోవడం, అధికారులు కూడా ఆ సంస్థ ప్రతినిధులను పిలిపించి మాట్లాడక పోవడంతో నెలల తరబడి సమస్య అలాగే ఉంటోంది. పాడైన ఆటోలను నెలలపాటు అలాగే వదిలేస్తే దేనికి పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమౌతుంది. వెంటనే ఆటోల మరమ్మతులకు దృష్టి సారించాలి.

డివిజన్‌కు రెండేసి చొప్పునైనా..

నగరపాలకసంస్థ పరిధిలో విలీనగ్రామాలతో కలిపి మొత్తం 57 డివిజన్లు ఉన్నాయి. డివిజన్‌కు రెండు చొప్పునైనా కాంపాక్టర్ ఒకటి, ట్రాక్టర్ ఒకటి అందుబాటులో ఉంచాల్సి ఉంది. దీంతోపాటు నగరంలోని 750 బ్లాక్ స్పాట్‌లలో సుమారు 500కు పైగా డంపర్‌బిన్లు శిథిలావస్థలో ఉన్నాయి. కొన్ని చోట్ల కొత్తగా కాంపాక్టర్ బిన్లు ఏర్పాటు చేశారు. మిగిలిన చోట్ల కూడా బిన్లు మార్చేలా చర్యలు తీసుకోవాలి. పారిశుద్ధ్య విభాగం ఎస్ఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో వెహికల్ షెడ్ ఏఈ, డీఈ, ఈఈలు సమన్వయంతో వ్యవహరించి అవసరమైన వాహనాలు ఇవ్వాల్సి ఉంది.

కాలం చెల్లిన వాహనాలతో..

నగరపాలక సంస్థ పాలకవర్గం వచ్చి నాలుగేళ్ల పూర్తయినా ఇప్పటివరకు వెహికల్ షెడ్ నిర్వహణపై చర్యలు తీసుకున్నది లేదు. వాహనాల్లో చాలావరకు కాలం చెల్లిపోవడం, కొన్ని మరమ్మతులకు గురికావడంతో మిగిలిన వాటితోనే చెత్త తరలిస్తున్నారు. డివిజన్‌కు రెండు వాహనాలు చొప్పున కూడా అందుబాటులో లేక పోవడంతో వీధుల్లో పారిశుద్ధ్యం దిగజారుతోంది. అదే సందర్భంలో వెహికల్ షెడ్ కేంద్రంగా ఇంధన వినియోగం, మరమ్మతుల పేరుతో నిధుల గోల్‌మాల్ జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రయివేటు ట్రాక్టర్లను ఏర్పాటు చేస్తున్నాం

దీనిపై ఇన్‌ఛార్జి ఎంహెచ్‌వో మధుసూదన్ 'న్యూస్‌టుడే' మాట్లాడుతూ ప్రయివేటుగా 20 ట్రాక్టర్లను, వాటికి అవసరమైన సిబ్బందిని తీసుకుని పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ-ఆటోలు వినియోగంలోకి తెచ్చేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నాం. అవసరమైన వాహనాలు అందుబాటులో ఉంచేలా ఇంజినీరింగ్ అధికారులను అడుగుతున్నాం.

ప్లాను మేరకే భవనాలు నిర్మించాలి


కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు ప్లాను నిబంధనల మేరకే ఉండాలని, అనుమతులకు విరుద్ధంగా కట్టడాలు జరిగితే ఆక్యుపెన్సీ ధ్రువప్రతం జారీ చేయబోమని కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శ్యామలానగర్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన భవనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. సెట్‌బ్యాక్‌లు, రహదారి కొలతలు తనిఖీ చేసి అనుమతులకు సంబంధించి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ ప్రణాళిక కార్యదర్శులు తమ పరిధిలో అనధికార, ప్లానుకు విరుద్ధంగా జరిగే నిర్మాణాలు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పర్యటనలో ఏసీపీ మురళీ, టీపీఎస్ రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.

28న సంగీత కళాకారుల సంఘ వార్షికోత్సవం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం వార్షికోత్సవం అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో శనివారం నిర్వహించనున్నామని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దు వెంకటస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాల్లో ఎం.ఎస్.బాబు బృందం ఎస్పీ బాలు పాడిన పాటలతో సంగీత విభావరితో పాటు పలువురు ప్రముఖులకు సన్మానాలు ఉంటాయన్నారు.

అథ్లెటిక్స్‌లో క్రీడాకారుల ప్రతిభ


క్రీడాకారులతో మాట్లాడుతున్న మహమ్మద్ బాషా తదితరులు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: టీజేపీఎస్ కళాశాలలో గుంటూరు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల పరిధిలో అండర్-14, 17 బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీలు గురువారం నిర్వహించారు. పోటీలను రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ మహమ్మద్ బాషా, టీజేపీఎస్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, డిగ్రీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎ.భానుమురళిలు కలిసి ప్రారంభించారు. పోటీల్లో రెండు నియోజకవర్గాల నుంచి 530 మంది విద్యార్థులు పాల్గొనగా.. పరుగు, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, హ్యామర్ త్రో, హైజంప్, హర్డిల్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడా పోటీలను మొహమ్మద్ బాషా పర్యవేక్షించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల వ్యాయామ అధ్యాపకులు ప్రభాకర్, రాజేంద్రప్రసాద్, విజయకుమార్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, శంకర్, అప్పారావు, సాయిబాబా, ఆంథోని, రాజేశ్వరి, అంజుబాయ్, సీత, శాంతకుమారి, జోస్పిన్, సామ్రాజ్యం, శివకుమారి, రవిశేఖర్, భరత్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. క్రీడా పోటీలు నిర్వహించిన వ్యాయామ అధ్యాపకుడు ఆర్.శివాజీని కళాశాల అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాంసుందర్, కార్యదర్శి, కరెస్పాండెంట్ కె.వి.బ్రహ్మం, కమిటీ సభ్యులు పోలిశెట్టి నాగసుందరంలు అభినందించారు.

బహుమతులు అందజేత


అతిథులు, నిర్వాహకులతో విజేతలు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐల ఆధ్వర్యంలో నగరంలోని పలు విద్యాసంస్థల్లో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గురువారం బ్రాడీపేటలోని కార్యాలయంలో బహుమతులు అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ జాషువా జీవితాంతం కుల వివక్ష, అంటరానితనం, దళితులపై దాడులు, మూఢనమ్మకాలు, విగ్రహారాధనకు వ్యతిరేకంగా రచనలు చేసి ప్రజలకు అంకితమిచ్చారన్నారు. కార్యక్రమంలో వైద్యులు రమణ యశస్వి, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా, నగర అధ్యక్షులు సమీర్, యశ్వంత్, వివిధ సంఘాల నాయకులు పద్మ, అప్పారావు, నళినీకాంత్, కృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారుల ప్రత్యేక డ్రైవ్

పట్నంబజారు, న్యూస్‌టుడే: ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థ ఉన్నతికి పాటుపడాలని గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం అన్నారు. గురువారం ఉదయం బస్టాండు, గాయిత్రి హోటల్ సెంటర్‌లో ప్రైవేటు వాహనాల్లో ప్రయాణికులు ఎక్కకుండా అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఈ తరహా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పర్యవేక్షణ లోపం.. ప్రజలకు శాపం


నడకదారిలో వాహనాల పార్కింగ్


శివాలయం సమీపంలో కుంచించుకుపోయిన ఫుట్‌పాత్


నెహ్రూనగర్ రైల్వేగేటు సమీపంలో ఇలా..


ఫుట్‌పాత్ వాహనాలతో నిండిపోగా.. నడిరోడ్డుపై పాదచారులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

దర్పణం

రహదారి ఇరుకుగా ఉందని ప్రజలు, వాహనచోదకుల సౌకర్యార్థం కొత్తపేట నుంచి నెహ్రూనగర్ వరకు మార్గాన్ని విస్తరించారు. సుమారు రూ.కోటి నిధులు వెచ్చించి సిమెంట్ రోడ్డుతోపాటు ఇరువైపులా నడకదారి (ఫుట్‌పాత్) నిర్మించారు. దశాబ్దాల కిందట పెట్టిన ప్రతిపాదనలు ఆచరణ రూపం దాల్చి.. పనులు సైతం సంవత్సరాల తరబడి సాగాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో నడకదారిని ఇష్టారాజ్యంగా నిర్మించారు. నెహ్రూనగర్ రైల్వేగేటు వద్ద సుమారు ఐదు అడుగుల వెడల్పు ఉండగా, శివాలయం వద్ద సగానికి కుంచించుకుపోయింది. ఆ మార్గంలో కొంతభాగం నడక దారి నిర్మించకుండా వదిలేశారు. తీరా కొత్తగా వేసిన నడకదారిని ప్రయివేటు ఆసుపత్రులు, వ్యాపార దుకాణాలు, ట్రావెల్స్ నిర్వాహకులు, ద్విచక్ర వాహనదారులు యథేచ్ఛగా పార్కింగ్‌కు ఉపయోగించుకుంటున్నారని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనివలన ఆ మార్గంలో ట్రాఫిక్ సమస్య నెలకొంటోందని వాపోతున్నారు. రహదారి విస్తరించి ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రద్దీ మార్గంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలనే ఉద్దేశంతో రూ.కోట్ల ప్రజాధనం వెచ్చించి నిర్మాణాలు చేసినా ప్రయోజన లేకుండా పోయిందని పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నడకదారి పనుల తీరును పరిశీలించి అక్రమాలు జరిగితే చర్యలు తీసుకోవడంతో పాటు పాదచారులకు ఉపయోగపడేలా ఆక్రమణలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

వ్యాసరచన పోటీలు

నగరపాలకసంస్థ: స్వచ్ఛ గుంటూరు సాధనలో విద్యార్థులను భాగస్వామ్యం చేయడం అభినందనీయమని కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఎన్టీఆర్ స్టేడియంలో ఐటీసీ బంగారు భవిష్యత్తు సహకారంతో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, నినాదాల పోటీలు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో కూడా వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగించాలని కోరారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో రామారావు, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, పోటీల నోడల్ అధికారి తిరుపతిరెడ్డి, ఐటీసీ బంగారు భవిష్యత్తు ప్రతినిధి నారాయణ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


స్వచ్ఛతా కార్యక్రమంలో డీఆర్ఎం రామకృష్ణ తదితరులు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని మండల రైల్వే అధికారి రామకృష్ణ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా రైల్ వికాస్ భవన్‌లోని వివిధ కార్యాలయాల్లో గురువారం శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సైమన్, చీఫ్ ప్రాజెక్టు మేనేజరు మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఎంఈ రవికిరణ్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, సీనియర్ డీపీవో షహబాజ్ హనూర్, సీనియర్ డీఎస్‌టీఈ రత్నాకర్, సీనియర్ డీఈఈ సూర్యనారాయణ, పలువురు అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

29న సంగీత విభావరి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శుభాంజలి కళావేదిక సంస్థ అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ ఆధ్వర్యంలో 'గాన గంధర్వుడు ఎస్పీ బాలు ఆణిముత్యాలు' పేరున సంగీత విభావరి ఆదివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నామని నిర్వాహకుడు చీకటి రవికాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ప్రత్యేకంగా బాలు 1970 నుంచి 1980 మధ్య పాడిన మధుర గీతాలను కళాకారులు ఆలపిస్తారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

? యాదవబజారు మూడో లైనులో ఆవులు రోడ్లపై సంచరిస్తున్నాయి. వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
-విజయసారథి, పాతగుంటూరు

✔ సమస్యను అధికారులకు వివరించి పరిష్కరిస్తాం.
-ఇజాక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? పాతగుంటూరులోని గాంధీబొమ్మ సెంటర్‌లో రోడ్డుకు ఇరువైపులా ఆటోలు నిలుపుతున్నారు. దీంతో ఇటుగా వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ స్తంభిస్తోంది.
-గిరి, జెండాచెట్టు సెంటర్

✔ ఆ ప్రాంతంలో సిబ్బందిని నియమించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.
-అశోక్‌కుమార్, ట్రాఫిక్ సీఐ

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

చౌత్రాసెంటర్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను గురువారం అధికారులు తొలగించారు. ఈ ప్రాంతంలో వ్యర్థాలు పేరుకుపోయాయని 'మేమున్నాం..మీకుతోడుగా'కు వచ్చిన ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారు స్పందించి సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. -న్యూస్‌టుడే, పట్నంబజారు

ఉద్యోగ భద్రత కల్పించండి


ధర్నా చేస్తున్న ముఠా కార్మికులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: ఉద్యోగ భద్రత కల్పించాలని, కూలి రేట్లు పెంచాలని కోరుతూ గురువారం గుంటూరులోని పౌరసరఫరాల గోదాముల వద్ద ఆ విభాగ ముఠా కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు మరియదాసు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు, నాయకులు కాంతారావు, డేవిడ్, సురేష్, బుజ్జి, జాన్‌బాబు, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ చేయించండి


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్

గుంటూరు నేరవార్తలు: తుళ్లూరు సమీపంలోని ఓ విశ్వవిద్యాలయంలో ఇటీవల బీటెక్ విద్యార్థిని మృతిచెందిన ఘటనపై ప్రభుత్వం విచారణ చేయించాలని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం బ్రాడీపేటలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మృతురాలి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు. అధ్యక్ష, సహాయక కార్యదర్శులు షేక్ సమీర్, యశ్వంత్ పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్యాయత్నం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : గృహిణి ఆత్మహత్యకు యత్నించిన ఘటనపై గురువారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేవీపీ కాలనీకి చెందిన వెంకటేశ్వరికి 15 ఏళ్ల కిందట వీరాస్వామితో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. వెంకటేశ్వరి కూలి పనికి వెళ్లగా వచ్చిన డబ్బులు ఇవ్వమని భర్త వేధిస్తుండేవాడు. తరచూ ఆమెపై అనుమానంతో చిత్రహింసలు పెట్టడంతో భరించలేక గురువారం ఇంట్లో ఎలుకల మందు కలుపుకొని తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న నగరంపాలెం సీఐ మధుసూదనరావు సిబ్బందితో వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్యకు యత్నించానని ఇచ్చిన ఫిర్యాదుపై వీరాస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విప్లవ కెరటం ఐలమ్మ


ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: చీకటిలో నలుగుతున్న బతుకులకు వెలుగు దారి చూపిన విప్లవ కెరటం ఐలమ్మ అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు ఐలమ్మ జయంతి గురువారం నిర్వహించారు. చంద్రమౌళీనగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే మాధవితో పాటు ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, తెదేపా జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్‌లు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ దొరతనాన్ని ఎదిరించి, భూస్వాములపై గర్జించిన ఆమె తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిప్పుకణికగా నిలిచారన్నారు.

గుంటూరు పశ్చిమ

విప్లవ కెరటం ఐలమ్మ


ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: చీకటిలో నలుగుతున్న బతుకులకు వెలుగు దారి చూపిన విప్లవ కెరటం ఐలమ్మ అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు ఐలమ్మ జయంతి గురువారం నిర్వహించారు. చంద్రమౌళీనగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే మాధవితో పాటు ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, ప్రధాన కార్యదర్శి నాగ మల్లేశ్వరరావు, తెదేపా జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్‌లు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ రైతాంగ పోరాట యోధురాలు ఐలమ్మ ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ప్రతిఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ దొరతనాన్ని ఎదిరించి, భూస్వాములపై గర్జించిన ఆమె తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిప్పుకణికగా నిలిచారన్నారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన యోధురాలు ఐలమ్మ అని కొనియాడారు.

తెదేపా జిల్లా కార్యాలయంలో...

తెదేపా జిల్లా కార్యాలయంలో ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే గళ్లా మాధవి నివాళులర్పించారు. ఐలమ్మ ఆశయాలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీ పని చేస్తుందన్నారు. తెదేపా బీసీ విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ తొలి భూపోరాటానికి ఆమె పునాది వేశారన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మల్లె ఈశ్వరరావు, సింహాద్రి కనకాచారి, కంచర్ల శివరామయ్య, నాయుడు ఓంకార్, షేక్ చినబాజి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణనగర్ రైతుబజారులో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో) టమాట 45, వంగ 22, బెండ 18, పచ్చిమిర్చి 20, కాకర 30, క్యారెట్ 46, బీర 22, క్యాబేజి 24, దొండ 32, బంగాళదుంప 39, ఉల్లిపాయలు 45, గోరుచిక్కుళ్లు 34, దోస 24, సొర 14, పొట్లకాయ 32, అరటికాయ 7, పెద్దచిక్కుళ్లు 52, బీట్‌రూట్ 27, క్యాప్సికం 60, బీన్స్ 62, కీరదోసకాయ 30, కొత్తిమీర 40, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 50, వెల్లుల్లి 250.
- న్యూస్‌టుడే, పట్టాభిపురం

అంతులేని నిర్లక్ష్యం

గత పాలకుల స్వార్థంతో డ్రెయిన్లు ఆక్రమించి నిర్మాణాలు | పట్టించుకోని నగరపాలక యంత్రాంగం | రహదారుల్ని ముంచెత్తుతున్న మురుగు

పట్టాభిపురం, న్యూస్‌టుడే

గత పాలకుల స్వార్థం.. అధికారుల నిర్లక్ష్యం.. వెరసి గుంటూరు నగరంలో యథేచ్ఛగా ఆక్రమణలు పెరిగిపోయాయి. నగరంలో డ్రెయిన్లు సక్రమంగా ఉంటే ఎంత వర్షం పడ్డా చుక్క నీరు కూడా రోడ్ల మీదకు రాకుండా కాల్వల్లోకి వెళ్లే పరిస్థితులున్నాయి. గత అయిదేళ్లుగా డ్రెయిన్లు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు మామూళ్లకు అలవాటు పడడంతో ఆక్రమణదారులు రెచ్చిపోయారు. ఎక్కడికక్కడ మురుగు కాలువలను ఆక్రమించేసి టిఫిన్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. రోడ్ల అంచులను ఆక్రమించేసి అద్దెలకు ఇచ్చేసి ఆదాయం పొందుతున్న కార్పొరేటర్లు కూడా కొందరు ఉన్నారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులతో పాటు వివిధ ప్రాంతాల్లోని రోడ్లు వాగుల్ని తలపించాయి. అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగానే ఈ పరిస్థితి దాపురించిందని ప్రజలు విమర్శిస్తున్నారు.


రింగ్ రోడ్డులో ఐటీసీ హోటల్ వద్ద తటాకాన్ని తలపిస్తున్న రహదారి


పొంగి పొర్లుతున్న మురుగు నీరు


లక్ష్మీపురంలో డ్రెయిన్‌ను ఆక్రమించి వ్యాపారాలు

దుకాణాల ముందు ర్యాంపులు

☛ లక్ష్మీపురం, పట్టాభిపురం ప్రధాన రహదారులతో పాటు రింగ్‌రోడ్డులో సైతం ఆక్రమణలు పెరిగిపోయాయి. వర్షపునీరు పోయే వీల్లేకుండా దుకాణాల ముందు పెద్ద పెద్ద ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రోడ్లపై పడ్డ వర్షపునీరు డ్రెయిన్లలోకి వెళ్లే వీలుండడం లేదు. ప్రధాన డ్రెయిన్లలో కనీసం పూడికతీత పనులు గత అయిదేళ్లు సక్రమంగా జరగలేదు. అన్ని రహదారుల్లోనూ డ్రెయిన్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించేసి అద్దెలకు ఇచ్చేసి ఆదాయం గడిస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై ఆక్రమణల సంగతి పెద్దగా పట్టించుకోలేదు.

☛ లక్ష్మీపురం రోడ్డులో పెద్ద షాపింగ్‌మాల్స్ వచ్చాయి. వాటికి తగ్గట్టుగా డ్రెయిన్ సామర్థ్యం పెంచలేదు. పాటిబండ్ల సీతారామయ్య విగ్రహం ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ పక్కన ఓ టిఫిన్ సెంటర్ నిర్వాహకులు డ్రెయిన్ మొత్తం ఆక్రమించినా అధికారులకు కనిపించడం లేదు. ఈ ప్రాంతంలో రోడ్లపై పడ్డ వర్షపునీరు కాల్వలోకి వెళ్లే వీల్లేకుండా సిమెంట్‌తో ఫ్లోరింగ్ చేసేసి ర్యాంపులు ఏర్పాటు చేశారు. ఫలితంగా మురుగునీరు పొంగి పొర్లడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది.

☛ ఈ మార్గంలో మదర్ థెరెసా విగ్రహం నుంచి బృందావన్ గార్డెన్స్, రాజేంద్రనగర్ వరకు ఇదే పరిస్థితి. ఎన్నో ఫుడ్ కోర్టులు, ఫాస్ట్‌ఫుడ్, బిర్యానీ సెంటర్లు అన్నీ డ్రెయిన్ల మీద వరకు నిర్మించారు.

☛ రింగ్‌రోడ్డులో ఐటీసీ హోటల్ వద్ద వర్షపునీరు, మురుగునీరు ఏకమై పొంగి పొర్లుతోంది. ఈ రహదారి తటాకాన్ని తలపిస్తోంది. కొరిటెపాడు నుంచి విద్యానగర్, గుజ్జనగుండ్ల, స్తంభాల గరువు, పట్టాభిపురం, జూట్‌మిల్లు, నగరంపాలెం వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి.

☛ మురుగునీరు పోయాక ప్రధాన రహదారులు సైతం బురదమయంగా తయారై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


స్వచ్ఛతా కార్యక్రమంలో డీఆర్ఎం రామకృష్ణ తదితరులు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని మండల రైల్వే అధికారి రామకృష్ణ తెలిపారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా రైల్ వికాస్ భవన్‌లోని వివిధ కార్యాలయాల్లో గురువారం శుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సైమన్, చీఫ్ ప్రాజెక్టు మేనేజరు మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఎంఈ రవికిరణ్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, సీనియర్ డీపీవో షహబాజ్ హనూర్, సీనియర్ డీఎస్‌టీఈ రత్నాకర్, సీనియర్ డీఈఈ సూర్యనారాయణ, పలువురు అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

సాయిబాబా గుడిలో ప్రాయశ్చిత్త దీక్ష


దీక్షలో పాల్గొన్న కూటమి నాయకులు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు వినియోగించి అపవిత్రం చేసిన కారణంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేశారు. దీనికి మద్దతుగా హౌసింగ్‌బోర్డు కాలనీ సాయిబాబా గుడిలో గురువారం గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, 28వ డివిజన్ అధ్యక్షుడు మామిడి రామారావు, ఉగ్గిరాల సీతారామయ్య, దాసరి రాము ప్రాయశ్చిత్త దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమానికి 29, 30 డివిజన్ల అధ్యక్షుడు పసుపులేటి నరసింహారావు, దాసరి వెంకటేశ్వరరావు, దాసరి లక్ష్మీదుర్గ, కొక్కెర శ్రీనివాస్, ఎర్రంశెట్టి పద్మావతి, రమాదేవి, భూషయ్య, సీతారామయ్య, కోట వెంకటేశ్వరరావు, మామిడి కల్యాణ్ తదితరులు మద్దతు తెలిపారు.

నియోజకవర్గాన్ని పరిశుభ్రంగా మార్చడమే లక్ష్యం



మీతోనే.. మీ వెంటే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని పరిశుభ్రంగా మార్చడమే లక్ష్యమని ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. 49వ డివిజన్‌లోని వేళంగిణి నగర్, కొండయ్య కాలనీల్లో 'మీతోనే.. మీ వెంటే..' అనే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. 'పశ్చిమ గుంటూరు-పరిశుభ్ర గుంటూరు' అనే నినాదంతో డివిజన్ మొత్తం చెత్త, వ్యర్థాల తొలగింపు, డ్రెయినేజీల్లో పూడికతీత కార్యక్రమాలకు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నాంది పలికారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ దేశాన్ని పరిశుభ్రంగా చేయాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి మోదీ స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఇందులో భాగంగా పరిశుభ్ర గుంటూరు పశ్చిమ సాధించేందుకు కార్మికులు యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. పులి శ్రీనివాసులు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి బాధ్యత తీసుకుంటే 100 శాతం శుభ్రత కార్యక్రమాలు పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే మాధవి సూచనల మేరకు సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మద్దిరాల మ్యాని, సింహాద్రి కనకాచారి, ముత్తినేని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

25వ డివిజన్‌లో వైద్య శిబిరం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 25వ డివిజన్‌లోని తెదేపా కార్యాలయంలో వికాస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గళ్లా మాధవి గురువారం ప్రారంభించారు. జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, వాస్క్యులర్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్, డెంటల్ సేవలు అందించారు. వికాస్ ఆసుపత్రి సీఈఓ నరసింహమూర్తి, వైద్యులు నీహారిక, సుధాకర్, సురేంద్ర, పవన్ తదితరులు రోగులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో స్క్రీనింగ్ అయిన వారికి నెల రోజుల పాటు ఉచిత కన్సల్టేషన్, పరీక్షలపై 50 శాతం రాయితీ ఇస్తామని సీఈఓ తెలిపారు.

శాంతియుత మార్గంపై పోటీలు


ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేత

ఏటీ అగ్రహారం: శాంతియుతంగా ఆలోచన చేసినప్పుడే సమస్యలకు మంచి పరిష్కార మార్గాలు దొరుకుతాయని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని చౌడవరంలోని ఆర్వీఆర్అండ్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులకు శాంతియుత మార్గం అనే అంశంపై ప్రసంగ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి, కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, కోశాధికారి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు, డాక్టర్ ఎన్.రేణుక పాల్గొన్నారు.


ఇన్నర్ రింగ్ రోడ్డు పెట్రోల్ బంక్ మలుపు వద్ద గుంతల పక్కగా వెళుతున్న వాహన చోదకుడు


గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్డు కూడలి మలుపు వద్ద ..

గుంతల దారులు.. బాగు చేయరూ!

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే

నగరంలో ఇటీవల కురిసిన వర్షాలు, ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరదతో ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారులు కూడా దెబ్బతిన్నాయి. గుంటూరు-అమరావతి రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి జేకేసీ కళాశాల, గుజ్జనగుండ్ల వైపు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారాయి. వాహనాలు గుంతల్లో పడడంతో ఒళ్లు హూనమవుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు కూడా గుంతల్లో నుంచి నడపాల్సి రావడంతో వాహనాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో దెబ్బతిన్న రోడ్ల గుంతలను పూడ్చాలని నగరపాలక సంస్థ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించలేదని వాహనదారులు, స్థానికులు పేర్కొంటున్నారు. వైకాపా ప్రభుత్వ హయాలో అయిదేళ్లు రోడ్లను అసలు పట్టించుకోలేదని, కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్లు బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


జేకేసీ కళాశాల సమీపంలో ..

ఎక్కడెక్కడంటే..

☛ గోరంట్ల ఇన్నర్ రింగ్ కూడలి నుంచి రవాణా శాఖ ఉప కమిషనర్ కార్యాలయం వైపు వెళ్లే హోటల్ మలుపు వద్ద రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో వేగంగా వచ్చిన వాహనదారులు అక్కడికి వచ్చేసరికి నియంత్రణ చేయలేక ఇబ్బందులు పడుతున్నారు.

☛ గుంటూరు రవాణ శాఖ ఉప కమిషనరు కార్యాలయం సమీపంలోని పెట్రోల్ బంక్ మలుపు వద్ద కూడా రోడ్డు గుంతలు పడటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

☛ గుజ్జనగుండ్ల వైపు వెళ్లే వరకు రోడ్డు రెండు వైపులా గుంతలు పడడంతో వాటిని తప్పించుకుని వెళ్లడానికి ఫీట్లు చేయాల్సి వస్తోంది. గుంతలతో కూడిన రోడ్లతో కుదుపులకు లోనై ఒళ్లు నొప్పులు వస్తున్నాయని, వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహన చోదకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అథ్లెటిక్స్‌లో క్రీడాకారుల ప్రతిభ


బాలికలతో మాట్లాడుతున్న మహమ్మద్ బాషా

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: టీజేపీఎస్ కళాశాలలో గుంటూరు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల పరిధిలో అండర్-14, 17 బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీలు గురువారం నిర్వహించారు. పోటీలను రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ మహమ్మద్ బాషా, టీజేపీఎస్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, డిగ్రీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎ.భానుమురళిలు కలిసి ప్రారంభించారు. పోటీల్లో రెండు నియోజకవర్గాల నుంచి 530 మంది విద్యార్థులు పాల్గొనగా.. పరుగు, షార్ట్‌పుట్, డిస్క్‌త్రో, హ్యామర్ త్రో, హైజంప్, హర్డిల్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడా పోటీలను మొహమ్మద్ బాషా పర్యవేక్షించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల వ్యాయామ అధ్యాపకులు ప్రభాకర్, రాజేంద్రప్రసాద్, విజయకుమార్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, శంకర్, అప్పారావు, సాయిబాబా, ఆంథోని, రాజేశ్వరి, అంజుబాయ్, సీత, శాంతకుమారి, జోస్పిన్, సామ్రాజ్యం, శివకుమారి, రవిశేఖర్, భరత్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. క్రీడా పోటీలు నిర్వహించిన వ్యాయామ అధ్యాపకుడు ఆర్.శివాజీని కళాశాల అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాంసుందర్, కార్యదర్శి, కరెస్పాండెంట్ కె.వి.బ్రహ్మం, కమిటీ సభ్యులు పోలిశెట్టి నాగసుందరంలు అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నగరపాలకసంస్థ: స్వచ్ఛ గుంటూరు సాధనలో విద్యార్థులను భాగస్వామ్యం చేయడం అభినందనీయమని కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఎన్టీఆర్ స్టేడియంలో ఐటీసీ బంగారు భవిష్యత్తు సహకారంతో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, నినాదాల పోటీలు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో కూడా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగించాలని కోరారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో రామారావు, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, పోటీల నోడల్ అధికారి తిరుపతిరెడ్డి, ఐటీసీ బంగారు భవిష్యత్తు ప్రతినిధి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లు లేక అవస్థలు

గోరంట్ల, న్యూస్‌టుడే: స్థానిక అమరావతి రోడ్డులోని పోస్టల్ కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. స్థానికంగా సీసీ రోడ్లు లేకపోవడంతో రాకపోకల సమయంలో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి సీసీ రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

గృహిణి ఆత్మహత్యాయత్నం

గుంటూరు నేరవార్తలు : గృహిణి ఆత్మహత్యకు యత్నించిన ఘటనపై గురువారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేవీపీ కాలనీకి చెందిన వెంకటేశ్వరికి 15 ఏళ్ల కిందట వీరాస్వామితో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. వెంకటేశ్వరి కూలి పనికి వెళ్లగా వచ్చిన డబ్బులు ఇవ్వమని భర్త వేధిస్తుండేవాడు. తరచూ ఆమెపై అనుమానంతో చిత్రహింసలు పెట్టడంతో భరించలేక గురువారం ఇంట్లో ఎలుకల మందు కలుపుకొని తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న నగరంపాలెం సీఐ మధుసూదనరావు సిబ్బందితో వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్యకు యత్నించానని ఇచ్చిన ఫిర్యాదుపై వీరాస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

29న సంగీత విభావరి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శుభాంజలి కళావేదిక సంస్థ అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ ఆధ్వర్యంలో 'గాన గంధర్వుడు ఎస్పీ బాలు ఆణిముత్యాలు' పేరున సంగీత విభావరి ఆదివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నామని నిర్వాహకుడు చీకటి రవికాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ప్రత్యేకంగా బాలు 1970 నుంచి 1980 మధ్య పాడిన మధుర గీతాలను కళాకారులు ఆలపిస్తారన్నారు.

28న సంఘ వార్షికోత్సవం

గుంటూరు సాంస్కృతికం: గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం వార్షికోత్సవం అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో శనివారం నిర్వహించనున్నామని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దు వెంకటస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాల్లో ఎం.ఎస్.బాబు బృందం ఎస్పీ బాలు పాడిన పాటలతో సంగీత విభావరితో పాటు పలువురు ప్రముఖులకు సన్మానాలు ఉంటాయన్నారు.

ఎన్నాళ్లీ అవస్థలు?



స్థానిక మూడు వంతెనల వద్ద పైపులైన్ లీకవడంతో నీరు రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి వస్తున్నాయి. ఆ నీరు కాస్త మురికిగా మారి రాకపోకలు సాగించే సమయంలో ప్రయాణికులపై చిందుతుంది. దీంతో కార్యాలయాలు, పాఠశాలలకు వెళ్లేవారు అక్కడ ఎంత జాగ్రత్తగా వచ్చినా బురదగా మారిన నీరు దుస్తులపై పడుతుందని చోదకులంటున్నారు. రోజులుగా నీరు లీకవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం లీకు అరికట్టాలని నగరవాసులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గోరంట్ల



పేరుకుపోయిన వ్యర్థాలు

పారిశుద్ధ్యం మెరుగుకు అనేక కార్యక్రమాలు చేస్తున్నా అవన్నీ కొన్ని ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయి. స్థానిక కేవీపీ కాలనీ శ్మశానం గోడ పక్కగా కొన్ని వారాలుగా చెత్త, మురుగుతో అపరిశుభ్ర వాతావరణం నెలకొన్నా పట్టించుకున్న నాథుడు లేరు. రోజులుగా మురుగు నిలిచి ఉండడంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే రోగాల బారిన పడతామని ఇక్కడి వారు ఆందోళన చెందుతున్నారు. వెంటనే పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కేవీపీ కాలనీ శ్మశానం గోడపక్కగా ఇలా...

- న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ(గుంటూరు)

ఈనాడు

బదిలీల గడువు ముగిసినా ఆగని ప్రయత్నాలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల గడువు ఈనెల 22న ముగిసినప్పటికీ జిల్లా పంచాయతీరాజ్ శాఖలో ఆశావహులు ఇప్పటికీ ప్రయత్నాలు చేస్తున్నారు. బదిలీల ఉత్తర్వులు జారీ చేసిన వారిని తప్పించి తమను ఆ స్థానాల్లో నియమించాలని కొందరు ఉద్యోగులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను నియోజకవర్గాల్లోని పోస్టులను పరిగణనలోకి తీసుకుని వారికి ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లాపరిషత్తు కార్యాలయ విభాగాల పరిపాలన అధికారులు మొత్తం 10 మందిలో ఏడుగురిని బదిలీ చేశారు. మండల పరిషత్తు కార్యాలయాల ఏవోలు ఏడుగురిని జడ్పీకి బదిలీ చేయగా.. నలుగురు విధుల్లో చేరారు. ప్రత్తిపాడు, పెదకాకాని మండలాల ఏవోలు అదనపు బాధ్యతలతో ఇన్‌ఛార్జి ఎంపీడీవోలుగా కొనసాగుతున్నారు. దాంతో అక్టోబరు రెండో తేదీ వరకు వారిని రిలీవ్ చేసే పరిస్థితి లేదు.

ప్రజాప్రతినిధుల ద్వారా ఒత్తిడి

☛ గ్రామీణ గుంటూరు మండల పరిషత్తు కార్యాలయం ఏవో తనను అక్కడే కొనసాగించాలని కోరినట్లు ప్రచారం సాగుతోంది.

☛ జడ్పీ-జి విభాగం ఏవోని ఆ స్థానంలో బదిలీ చేయగా అక్కడి ఏవో విధుల నుంచి రిలీవ్ కాకపోవడంతో ఆయన ఇక్కడే ఆగిపోయారు.

☛ జిల్లాలోని ఓ మండలంలో పనిచేస్తున్న ఏవోని జిల్లాపరిషత్తుకు బదిలీపై తీసుకొచ్చేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. బదిలీల ప్రక్రియ ముగిసినందున మార్పులు చేసేందుకు పాలకవర్గం, అధికారులు వీలు కాదని స్పష్టం చేసినట్లు సమాచారం. సదరు అధికారిని ఏదోవిధంగా బదిలీ చేయాలని ప్రజాప్రతినిధుల ద్వారా ఒత్తిడి చేస్తుండడంతో అధికారులు సంకట పరిస్థితిని ఎదుర్కొంటున్నారని జడ్పీ వర్గాలు తెలిపాయి.

☛ ఇప్పటికీ మినిస్టీరియల్ ఉద్యోగులు పలువురు తాము కోరుకున్న స్థానాలకు బదిలీ చేయాలని కోరుతుండడంతో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఈవో జ్యోతిబసుకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఒకవేళ బదిలీ ఉత్తర్వులు జారీ చేసినా పాత తేదీతో ఇవ్వాల్సి ఉండడంతో సాంకేతికంగా ఇబ్బందులు ఎదురు కానున్నాయి.

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్



యూనివర్సిటీ ఎదుట మృతురాలి తల్లి మంజుల, ఏఐఎస్ఎఫ్ నాయకుల నిరసన



వీసీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

గుంటూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం ఐనవోలు సమీపంలోని వీఐటీ యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతూ ఈ నెల 17న ఆత్మహత్య చేసుకున్న సాయిశ్రియ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతురాలి తల్లి మంజుల, ఏఐఎస్ఎఫ్ నాయకులు గురువారం వర్సిటీ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. విద్యార్థిని చిత్రపటానికి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, వీసీ వెంటనే రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. సాయంత్రం తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, తెదేపా కార్యకర్తలు అక్కడకు రాగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. అయినా వారిని నెట్టేసి లోపలకు వెళ్లారు. తుళ్లూరు సీఐ జి.వెంకటేశ్వర్లు.. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌ను లోపలకు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వస్తున్నారని తెలిసిన వీసీ.. మృతురాలి తల్లి మంజులతో మాట్లాడారు. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అంటే లెక్క లేదా? సెక్యూరిటీతో అడ్డుకుంటారా? ఏమనుకుంటున్నారు? అంటూ వీసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థిని తల్లి బాధలో ఉంటే వారితో మీకు మాట్లాడే తీరికే లేదా? కనీస మానవత్వం లేకుండా ప్రవర్తిస్తారా? అంటూ మండిపడ్డారు. యూనివర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య చేసుకొని చనిపోయినా మీకు బాధ్యత లేదా అంటూ వీసీ ఎస్‌వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ చంద్రలను నిలదీశారు. 'మృతి చెందిన విద్యార్థికి యాజమాన్యం కనీసం నివాళులర్పించలేదు. పోలీసులను పంపి సమస్య పరిష్కారం అయ్యేలా చూడమని చెప్పా. కానీ యూనివర్సిటీ యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరించింది. విద్యార్థి మృతిపై ఆమె తల్లిదండ్రులకు అన్ని వివరాలు చెప్పాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉంది' అని ఎమ్మెల్యే అన్నారు. యాజమాన్యం వారు కనీస మర్యాద లేకుండా ప్రవర్తిస్తున్నారని ఎమ్మెల్యే మందలించడంతో రిజిస్ట్రార్ క్షమాపణలు చెప్పారు. మృతి చెందిన విద్యార్థినికి న్యాయం చేసి తనకు ఫోన్ చేయాలని చెప్పి ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం తుళ్లూరు ఇన్‌ఛార్జి డీఎస్పీ మల్లికార్జునరావు, సీఐ వెంకటేశ్వరావు, వీసీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ మృతురాలి బంధువులతో చర్చించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, నాసర్, పాశం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి సోదరి చదువు బాధ్యత యాజమాన్యానిదే?

మృతురాలు సాయిశ్రియ సోదరి ఇంటర్ ద్వితీయ ఏడాది చదువుతోంది. ఆమెకు దేశంలో ఉన్న వీఐటీ వర్సిటీల్లో ఎక్కడైనా సీటిచ్చి చదువు పూర్తయ్యే వరకు పూర్తి బాధ్యత, ఖర్చులు యాజమాన్యం చూసుకుంటుందని హామీ ఇచ్చినట్లు సమాచారం.

స్వయంకృషితో విశ్వనరుడిగా ఎదిగిన జాషువా



మాట్లాడుతున్న కొరివి విజయకుమార్, పక్కన మాణిక్యవరప్రసాద్ తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పేదరికం, అంటరానితనం ఎదుర్కొన్న స్థాయి నుంచి విశ్వనరుడి స్థాయికి ఎదిగిన మహాకవి గుర్రం జాషువా అని దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. నగరంపాలెంలోని మహాకవి విగ్రహం దగ్గర జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో 'జాషువా సాహిత్యం-జీవితం' అనే అంశంపై సభ గురువారం జరిగింది. సభకు తెనాలి ప్రభుత్వ సహాయ న్యాయవాది శుద్ధపల్లి సుకుమార్ అధ్యక్షత వహించారు. వినయ్‌కుమార్ మాట్లాడుతూ జాషువా స్వయంకృషితో విశ్వనరుడి స్థాయికి ఎదగడం అందరికీ ఆదర్శమన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ జాషువా కవి మాత్రమే కాదని, తెలుగు భాషా సాంస్కృతిక ప్రతినిధి అని కొనియాడారు. హైకోర్టు న్యాయవాది గడ్డం ఎలీషా మాట్లాడుతూ జీవితాన్నే సాహిత్యంగా మలచుకున్న మహనీయుడన్నారు. కాపు సంఘ నాయకుడు మాదా రాధ, గ్రంథపాలకుడు సొపాటి రమేష్ మాట్లాడుతూ మహాకవి కవిత్వం అజరామరమని పేర్కొన్నారు. మహిళా న్యాయవాది పరిశపోగు అపర్ణాదేవి, పద్య గాయకులు ఎనుబరి చంద్రపాల్, జెట్టి బాబూరావు, గుర్రాల వెంకటేశ్వర్లు, హార్మోనిస్ట్ సలీంబాబు, గడ్డం ఎలీషాలను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో కోట మోహన్‌రావు, ఎంజేఏఎస్ సహాయ కార్యదర్శి కందుల ప్రసాదరావు, దాసరి జాన్‌బాబు, అత్తోట జోసెఫ్, ఎనుబరి వెంకటరత్నం, నిర్వాహకులు పుసులూరి విజయ్‌కుమార్, గోనె లూథర్‌పాల్, న్యాయవాది వీరమణి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

మేడికొండూరు, న్యూస్‌టుడే: గడ్డి మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కూలీ మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని భీమినేనివారిపాలెంకు చెందిన ఇబ్రహీం(20) కూలీ పని చేస్తుంటాడు. మద్యానికి అలవాటు పడ్డాడు. తాగ వద్దని తల్లి సైదాభాను అప్పుడప్పుడు అతడ్ని మందలిస్తుంటుంది. ఈ నెల 16వ తేదీ ఇబ్రహీం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో తల్లి.. కొడుకును మందలించి బయటకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి వచ్చే సరికి అతడు వాంతులు చేసుకుంటున్నాడు. ఏమైందని ఆరా తీయగా గడ్డి మందు తాగినట్లు చెప్పాడు. గుంటూరు సర్వజనాసుపత్రికి తరలించగా.. 24వ తేదీ మృతి చెందాడు. ఇదిలా ఉండగా.. ఈనెల 15వ తేదీ ఇబ్రహీం గ్రామంలోని రంగయ్య దుకాణం వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో దొంగతనం చేయడానికి వచ్చావా? అంటూ రంగయ్య, నారాయణలు చేయి చేసుకున్నారు. అవమానం తట్టుకోలేక ఇబ్రహీం గడ్డి మందు తాగాడని మృతుడు తల్లి సైదాభాను ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత బలవన్మరణం

మేడికొండూరు, న్యూస్‌టుడే: కడుపునొప్పి తాళలేక వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని యలవర్తిపాడుకు చెందిన సుబ్బాయమ్మ(30)కు, పల్నాడు జిల్లా పాపాయపాలెంకు చెందిన వేముల శ్రీనివాసరావుతో కొన్నేళ్ల కిందట వివాహమైంది. కొన్నాళ్లుగా యలవర్తిపాడులో నివాసం ఉంటున్నారు. కొద్ది రోజులుగా సుబ్బాయమ్మ కడుపు నొప్పితో బాధ పడుతోంది. తట్టుకోలేక ఈనెల 23వ తేదీ గడ్డి మందు తాగింది. గుంటూరు సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. గురువారం శవ పంచనామా జరిగింది. మృతురాలి తమ్ముడు గోపి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రేలంగి నరసింహారావుకు పురస్కారం ప్రదానం



నరసింహారావును సత్కరిస్తున్న నన్నపనేని రాజకుమారి, మన్నవ సుబ్బారావు తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై చలనచిత్ర దర్శకుడు రేలంగి నరసింహారావుకు అక్కినేని నాగేశ్వరరావు ఆత్మీయ పురస్కార ప్రదానం జరిగింది. కళావిపంచి వ్యవస్థాపకుడు బొప్పన నరసింహారావు(హైదరాబాద్), ఆరాధన ఆర్ట్స్ అకాడమీ గుంటూరు సంయుక్త నిర్వహణలో గురువారం రాత్రి సభ జరిగింది. ముఖ్యఅతిథిగా మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి పాల్గొని సన్మాన గ్రహీత దర్శకత్వ ప్రతిభను ప్రశంసించారు. సభకు మిర్చియార్డు మాజీ అధ్యక్షుడు మన్నవ సుబ్బారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, ఎన్టీఆర్ కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు వజ్జా మధుసూదనరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, కనకదుర్గమ్మ దేవాలయం పూర్వ పాలకమండలి సభ్యుడు వల్లూరి సంజయ్, నాటక, చలనచిత్ర దర్శకుడు చెరుకూరి సాంబశివరావు, ఎంవీఐ తెనాలి మధుసూదనరావు, సంస్థ ప్రతినిధి గరికపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు. తొలుత ముప్వా పెద బాపిరెడ్డి.. రాయబారం, గయోపాఖ్యానం నాటక సన్నివేశాల్లోని పాత్రలను అభినయించారు. ఆరాధన ఆర్ట్స్ అకాడమీ గుంటూరు వారు 'మరీ అంతొద్దు' నాటికను ప్రదర్శించారు. సంస్థల ప్రతినిధులు డి.తిరుమలేశ్వరరావు, జి.మల్లికార్జునరావు, నడింపల్లి వెంకటేశ్వరరావు, జీవీజీ శంకర్, సయ్యద్ జానీ బాషా, మధుసూదనరావు తదితరులు కళాకారులను, అతిథులను సత్కరించారు.

విశ్రాంత పోలీసు అధికారుల సంఘం విరాళం



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కాళహస్తి సత్యనారాయణ, సీఆర్ నాయుడు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు రూ.8,11,116 విరాళం అందజేశారు. దీనికి సంబంధించి చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విశ్రాంత పోలీసు అధికారుల సంఘం గౌరవ అధ్యక్షుడు సి.ఆర్.నాయుడు, అధ్యక్షుడు మాలకొండయ్య, ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రవిచంద్ర అందజేశారు. విరాళం అందజేసిన విశ్రాంత పోలీసు అధికారులను చంద్రబాబు అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి

వినుకొండ రూరల్: ఈ నెల 28 నుంచి 30 వరకు 68వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ అండర్-17 బాల బాలికలకు వినుకొండ లయోల పాఠశాల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 13 జిల్లాల నుంచి 520 మంది బాల బాలికలు, శిక్షకులు, మేనేజర్లు పాల్గొంటారన్నారు.

ఓపీ చీటీకి నిరీక్షణ పాట్లు



దర్పణం

సర్వజనాసుపత్రి పొరుగు రోగుల విభాగం వద్ద పేర్లు నమోదు చేసుకునేందుకు రోగులు తీవ్ర ఇక్కట్లకు గురి కావాల్సి వస్తోంది. నిత్యం అక్కడ తమ వంతు కోసం వరుసలో తోసుకోవాల్సి దుస్థితి నెలకొంటుంది. ప్రస్తుతం అక్కడ 13 కౌంటర్లు మాత్రమే ఉన్నాయి. ఇందులో 10 పని చేస్తున్నాయి. ఈ కౌంటర్లను 25కి పెంచితే రద్దీని కొంతమేర నియంత్రించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. తరచుగా సర్వర్ ఆగిపోవడం మరో సమస్యగా ఉంది. ప్రస్తుతం జీజీహెచ్‌కు వస్తున్న రోగుల్లో ఎక్కువ మందికి ఓపీ చీటీ తీసుకోవడమే పెద్ద సవాల్‌గా మారింది. అందువల్ల అదనపు కౌంటర్లు త్వరగా ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. **-న్యూస్‌టుడే, గుంటూరు వైద్యం**

నీళ్లలో నియంత్రికలు



సెంట్రల్ డిస్కంలో గత ప్రభుత్వంలో పని చేసిన ఉన్నతాధికారి నిర్వాకంతో రూ.లక్షల విలువ చేసే విద్యుత్తు నియంత్రికలను నీళ్లలోనే పడేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గుంటూరు సర్కిల్‌కు ఎన్ని అవసరమో అడగకుండానే గుత్తేదారుకు లబ్ధి చేకూర్చేందుకు వందల ట్రాన్స్‌ఫార్మర్లను ఒకేసారి సరఫరా చేశారు. వాటిని ఎక్కడ వినియోగించుకోవాలో తెలియక స్టోర్సు లోపల నిల్వ చేసేందుకు స్థలం లేక విద్యుత్తు భవన్ ఆవరణలో బయటే పడేశారు. దీంతో నియంత్రికలు నీళ్లలో నానుతున్నాయి. **-న్యూస్‌టుడే, గుంటూరు విద్యుత్తు**

ప్రాక్టీస్ బిట్లు

1. 'స్వస్తిక' అంటే..
   1) ఇది ఒక మతపరమైన గుర్తు.
   2) గోధుమ, బార్లీని వర్షాకాలంలో 60 రోజుల్లో పండించడం.
   3) వరిని వర్షాకాలంలో 60 రోజుల్లో పండించడం.
   4) వరిని వేసవిలో 60 రోజుల్లో పండించడం.
2. శతపథ బ్రాహ్మణం ప్రకారం వరి నాట్లు వేసి పండించడాన్ని ఏమంటారు?

ఇండియన్ హిస్టరీ

   1) కినుక 2) నెల్లూకా 3) స్వస్తిక 4) ప్లసుక
3. జనపదాల కాలంలో 'కుసుదిన్' అంటే..
   1) అప్పు ఇచ్చిన వ్యక్తి 2) అప్పు తీసుకున్న వ్యక్తి 3) మధ్యవర్తి 4) వర్తకుడు
4. జనపదాల కాలంలో బ్రాహ్మణులకు గౌరవంగా ఇచ్చే బంగారు నాణం?
   1) శతమానం 2) సువర్ణ 3) నిష్క 4) కృష్ణాల
5. కిందివాటిలో జనపదాల కాలంలో ప్రముఖ వర్తక కేంద్రం కానిది?
   1) రాజగృహ 2) చంప 3) కాశీ 4) బోధన్
6. జనపదాల కాలంలో రేవు పట్టణం కానిది?
   1) తక్షశిల 2) బరుకచ్ఛం 3) వైశాలి 4) కాశీ
7. కిందివాటిలో జనపదాల కాలం నాటి రహదారి మార్గం కానిది?
   1) కౌశాంబి నుంచి గంగా మైదానాల ద్వారా ఇరాన్, మధ్య ఆసియాకు
   2) రాజగృహ నుంచి కౌశాంబి, ఉజ్జయిని ద్వారా పశ్చిమ దేశాలకు
   3) గంగా మైదానాల ద్వారా రష్యాకు
   4) గంగా మైదానాల నుంచి దక్షిణ తూర్పు ప్రాంతాలకు

సమాధానాలు: 1-3; 2-4; 3-2; 4-1; 5-4; 6-4; 7-3.

ఈనాడు ప్రతిభ


pratibha.eenadu.net/eenadupratibha.net

ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కాలుష్యానికి పరిష్కారం.. శిలాజాలకు ప్రత్యామ్నాయం!

జనరల్ స్టడీస్ - పర్యావరణ అంశాలు

జీవద్రవ్యాల నుంచి ఉత్పత్తి అయ్యే ఇంధనాలే జీవ ఇంధనాలు. పెట్రోలియం లాంటి శిలాజ ఇంధనాలు సహజ ప్రక్రియలో చాలా నెమ్మదిగా తయారవుతాయి. కానీ జీవ ఇంధనాలను మాత్రం మొక్కలు, వ్యవసాయ, గృహ, పారిశ్రామిక జీవవ్యర్థాల నుంచి తక్కువ వ్యవధిలోనే ఉత్పత్తి చేయవచ్చు. అటు కాలుష్య సమస్యకు పరిష్కారంగా, ఇటు శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా వినియోగంలోకి వస్తున్న ఈ పునరుత్పాదక ఇంధన వనరుల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ప్రధానంగా రవాణా రంగంలో వినియోగం అధికమవుతున్న ఈ జీవఇంధనాల రకాలు, ఉత్పత్తి వనరులు, అందుకు అవసరమైన సాంకేతికతలు, వాటి వినియోగం తీరుతెన్నులు, ఆర్థిక, పర్యావరణపరమైన ఉపయోగాలను తెలుసుకోవాలి.



జీవ ఇంధనాలు

జీవ ఇంధనాలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జీవద్రవ్యరాశి వనరుగా ఉంటుంది. మొక్కల సంబంధిత పదార్థాలు/ జంతువుల వ్యర్థాలతోనే జీవద్రవ్యరాశి తయారవుతుంది. జీవ ఇంధనాలు 1) ఘన 2) ద్రవ 3) వాయువు రూపాల్లో ఉంటాయి.

ప్రాథమిక జీవ ఇంధనాలు: ఇందులో సేంద్రియ పదార్థం ప్రత్యక్షంగా జీవ ఇంధనంగా ఉపయోగపడుతుంది.
ఉదా: వంటచెరకు, వుడ్‌చిప్స్, బ్రికెట్స్

ద్వితీయ జీవ ఇంధనాలు: ఈ ఇంధనాల్లో జీవ ద్రవ్యరాశికి చెందిన ప్రాసెస్ చేసిన పదార్థాలు ఉంటాయి. **ఉదా:** ఇథనాల్, బయోడీజిల్.

జీవఇంధనం తరాలు:

1) మొదటి తరం జీవ ఇంధనాలు: ఆహార పంటల ఉత్పన్నాలైన పిండిపదార్థాలు, చక్కెరలు, వెజిటబుల్ ఆయిల్స్, జంతువుల కొవ్వును ఉపయోగించి మొదటితరం జీవ ఇంధనాలను తయారుచేస్తారు. అంటే మొదటితరం జీవ ఇంధనాలు కిణ్వప్రక్రియ ద్వారా తయారవుతాయి. వీటి ఉత్పత్తి వనరులుగా మొక్కజొన్న, గోధుమ, చెరకు, షుగర్ బీట్, వేరుశనగ, సోయాబీన్స్, రాప్సీడ్ లాంటి వాటిని ఉపయోగిస్తారు. మొదటితరం జీవ ఇంధనాలకు **ఉదా:** బయోగ్యాస్, బయోడీజిల్, ఇథనాల్.

- ☆ మొదటితరం జీవ ఇంధనంగా ఉత్పత్తి చేసిన ఇథనాల్‌ను వాహనాల ఇంజిన్ భాగాలను మార్పు చేసి ప్రత్యక్షంగానైనా ఉపయోగించవచ్చు లేదా పెట్రోలియంలో కలిపి కూడా వాడవచ్చు.
- ☆ 1 లీటర్ ఇథనాల్ = 1 లీటర్ పెట్రోల్ ద్వారా విడుదలయ్యే శక్తిలో 2/3వ వంతుకు సమానం.
- ☆ పెట్రోలియంతో కలిపి ఇథనాల్‌ను ఉపయోగించడం వల్ల వెలువడే కార్బన్, సల్ఫర్ ఉద్గారాలు తక్కువగా ఉంటాయి.

బయోగ్యాస్: మొదటి తరం జీవ ఇంధనాలకు ఉదాహరణ. ఇందులో 60 శాతం మీథేన్, 40 శాతం కార్బన్ డయాక్సైడ్, కొన్ని అరుదైన వాయువులు ఉంటాయి.

> **కిణ్వన ప్రక్రియ:** కిణ్వన ప్రక్రియను జీవక్రియ ప్రక్రియగా నిర్వచించవచ్చు. దీనిలో బ్యాక్టీరియా, ఈస్ట్ ఆక్సిజన్ లేనప్పుడు గ్లూకోజ్‌ను యాసిడ్, ఆల్కహాల్ లేదా వాయువుగా మారుస్తుంది. ☆ వాణిజ్యపరమైన ఇథనాల్ ఉత్పత్తికి 'సాకరోమైసెస్' అనే ఈస్ట్‌ను ఉపయోగిస్తారు.

2) రెండో తరం జీవఇంధనాల వెలికితీతకు ఉపయోగించే సాంకేతికత: మొదటితరం జీవ ఇంధనాలకు ఉపయోగించే ముడిసరకునే రెండోతరం జీవ ఇంధనాలకూ వాడతారు. అయితే అన్నిరకాలూ రెండోతరం జీవ ఇంధనాలకు ఉపయోగపడకపోవచ్చు, అందుకే ప్రత్యేకించి కొన్ని మొక్కలను పెంచి వాటి ప్రత్యక్ష జీవద్రవ్యరాశిని వినియోగించవచ్చు. ఇవి సాధారణంగా ఆహారేతర పంటలు. **ఉదా:** గడ్డిమారండి, జట్రోపా, కానుగ.

- ☆ ఈ ముడిసరకు లిగ్నో సెల్యులోజ్‌తో నిర్మితమై ఉంటుంది. అందుకే వీటి నుంచి ఇంధనాలు పొందాలంటే అనేక ప్రాసెసింగ్ దశలు అవసరమవుతాయి. **ఉదా:** 1) థర్మోకెమికల్ మార్పిడి (ఇందులో పైరోలైసిస్, గ్యాసిఫికేషన్ లాంటి చర్యలు ఇమిడి ఉంటాయి) 2) జీవరసాయన మార్పిడి (ఇందులో ట్రాన్స్‌స్టెరిఫికేషన్ లాంటి చర్యలు ఇమిడి ఉంటాయి)

3) మూడోతరం జీవ ఇంధనాలు: ఈ జీవఇంధనాలను ఆల్గల్ ఆయిల్/ఆల్గా ఆయిల్ అంటారు. ఎందుకంటే శైవల వర్గానికి చెందిన వాటితోనే ఈ జీవఇంధనాలను ఉత్పత్తి చేస్తారు. **ఉదా:** బోట్రియోకోకస్, స్కిజోఛైట్రియం లాంటివి. వీటి పొడి బరువులో సుమారుగా 80% లిపిడ్లు ఉంటాయి. క్లోరెల్లా, డునాలియెల్లా లాంటి శైవలాల్లోనూ లిపిడ్లు కలిసి ఉంటాయి. ట్రాన్స్‌స్టెరిఫికేషన్ ప్రక్రియను ఉపయోగించి లిపిడ్లను బయోడీజిల్‌గా మార్చవచ్చు.

బయోడీజిల్ లేదా జీవ ఇంధనాల ఉత్పత్తికి శైవలాలే ఎందుకు?: ☆ భూమిపైన అతివేగంగా పెరిగే మొక్కలు శైవలాలు. కాలానుగుణంగా పండే పంటల మాదిరి కాకుండా వీటిని సంవత్సరమంతా పెంచవచ్చు. ఒక హెక్టారులో పండించే శైవలం ఉత్పాదకత.. సోయాబీన్, జట్రోపా, మొక్కజొన్న మొక్కల కంటే 10 - 100 రెట్లు ఎక్కువ. ☆ శైవలాల జీవ ద్రవ్యరాశి మొత్తం అంత్య ఉత్పన్నంలో వినియోగమవుతుంది. ఇతర మొక్కల్లో ఈ విధమైన అనుకూలత ఉండదు. కానుగలో విత్తనాలు మాత్రమే జీవ ఇంధనాల తయారీకి ఉపయోగిస్తారు. ☆ జట్రోపా మొక్క విత్తనాలు దిగుబడి ఇవ్వాలంటే 2-3 ఏళ్లు పడుతుంది. అదే శైవలం దిగుబడి 2-3 రోజుల్లోనే వస్తుంది.



4) నాలుగో తరం జీవ ఇంధనాలు: విద్యుత్తు-జీవ ఇంధనాలు/ సూక్ష్మజీవుల ఇంధన కణాలు-MFC సాంకేతికతను ఉపయోగించి వీటిని ఉత్పత్తి చేస్తారు.

వ్యర్థాల నుంచి శక్తి ఉత్పత్తి చేయడం: క్షీణత చెందే ప్రతి సేంద్రియ వ్యర్థం శక్తి ఉత్పత్తికి ముడివనరుగా ఉపయోగపడుతుంది. సాంకేతికతతో ఘన, ద్రవ వ్యర్థాల ద్వారా కలిగే దుష్ప్రభావాలను తగ్గించవచ్చు. వ్యర్థాలను పలు విధాలుగా వర్గీకరించవచ్చు. 1) పట్టణ వ్యర్థాలు 2) పారిశ్రామిక వ్యర్థాలు 3) జీవ ద్రవ్యరాశి వ్యర్థాలు 4) బయోమెడికల్ వ్యర్థాలు.

వ్యర్థాల నుంచి శక్తిని పొందే సాంకేతికతలు: జీవక్షయం చెందే, చెందని వ్యర్థాల నుంచి పలు పద్ధతుల్లో శక్తిని పొందవచ్చు.

1) **ఉష్ణమార్పిడి:** ఇందులో దహన ప్రక్రియ ప్రధాన ఎంపికగా ఉంటుంది. ప్రస్తుతం ఈ విధానంపై దృష్టి సారించడం లేదు.

2) **థర్మోకెమికల్ మార్పిడి:** సేంద్రియ జీవక్షయం చెందని, తక్కువ తేమ ఉండే వ్యర్థాలను శక్తిగా మార్చడానికి ఈ విధానాన్ని ఉపయోగిస్తారు.

3) **బయో కెమికల్ మార్పిడి:** వాయురహిత జీర్ణక్రియ, కిణ్వప్రక్రియలు ఈ వర్గంలో ప్రధాన సాంకేతిక ఎంపికలు.

4) **విద్యుత్తు కెమికల్ మార్పిడి:** ఈ విధానంలో సూక్ష్మఇంధన కణాల (MFCs)ను ఉపయోగించి వ్యర్థాల నుంచి శక్తిని పొందుతారు.

కొన్ని ముఖ్యమైన జీవ ఇంధనాలు:

బయో-ఇథనాల్: పిండిపదార్థం, చక్కెర పంటల లాంటి మూలాల నుంచి కిణ్వ ప్రక్రియ ద్వారా దీన్ని ఉత్పత్తి చేస్తారు. సాధారణంగా పెట్రోల్‌తో కలుపుతారు.

గమనిక: 2022, జూన్‌లో ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ కార్యక్రమం కింద దేశంలో పెట్రోల్‌లో సగటున 10% ఇథనాల్ కలపాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం సాధించింది. ఈ లక్ష్యం 2022, నవంబరు నాటికి సాధించాల్సి ఉండగా 5 నెలల ముందే సాధ్యమైంది.

బయోడీజిల్: కూరగాయలు/ మొక్కలు/ జంతువుల నూనెల నుంచి ట్రాన్స్‌స్టెరిఫికేషన్ ప్రక్రియ ద్వారా దీన్ని తయారుచేస్తారు.

బయోగ్యాస్: వృక్ష, జంతు సంబంధ వ్యర్థాలను వాయురహితంగా కుళ్లబెట్టడం ద్వారా బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తారు.

బయోఇథనాల్: బయో ద్రవ్యరాశిని కిణ్వప్రక్రియకు గురి చేసి బయో-బ్యూటనాల్ తయారు చేస్తారు.

- ☆ లూయిపాశ్చర్ 1857లో కిణ్వప్రక్రియను కనుక్కున్నాడు.
- ☆ 1857లో లాక్టిక్ యాసిడ్ క్షయం సూక్ష్మజీవుల వల్ల సంభవిస్తుందని నిరూపించాడు. ☆ 1860లో సూక్ష్మజీవుల పని పాశ్చరైజేషన్‌ను ప్రేరేపించిందని గుర్తించాడు.

జీవ ఇంధనాల ప్రయోజనాలు

జీవ ఇంధనాలు ప్రస్తుత ఇంజిన్ డిజైన్లకు అనుగుణంగా ఉంటాయి. విభిన్న పరిస్థితుల్లో బాగా పనిచేస్తాయి. ☆ ఇవి మెరుగైన లూబ్రికేటింగ్ లక్షణాలతో ఉంటాయి. ఇది వాహన ఇంజిన్ జీవితకాలాన్ని పెంచుతుంది. ఇంజిన్‌ను ఎక్కువసేపు పనిచేసే విధంగా చేస్తుంది. తక్కువ నిర్వహణ వ్యయం, కాలుష్యాన్ని తగ్గిస్తుంది.

తక్కువ కార్బన్ ఉద్గారాలు: జీవ ఇంధనం పునరుత్పాదక వనరుల నుంచి తయారవుతుంది. శిలాజ డీజిల్‌తో పోలిస్తే తక్కువ మండే సామర్థ్యం ఉంటుంది. ☆ ప్రామాణిక డీజిల్‌తో పోలిస్తే జీవఇంధనం తక్కువ హానికరమైన కార్బన్ ఉద్గారాలను వెలువరిస్తుంది. ☆ జీవ ఇంధనాలు హరిత గృహ వాయువులను 65 శాతం వరకు తగ్గిస్తాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ☆ జీవ ఇంధనాలకు ముడి సరకు సులువుగా లభ్యమవుతుంది.

ఆర్థిక భద్రత: ఎక్కువమంది ప్రజలు జీవ ఇంధనాల వైపు మొగ్గు చూపితే, ఒక దేశం శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చు. పెరుగుతున్న జీవ ఇంధన పరిశ్రమతో మరిన్ని ఉద్యోగాల సృష్టి సాధ్యమవుతుంది. ఇది మన ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుంది.

తక్కువ స్థాయి కాలుష్యం: జీవ ఇంధనాలు జీవక్షయం చెందుతాయి. ఫలితంగా వీటి రవాణా, నిల్వ లేదా ఉపయోగం సమయంలో నేల కాలుష్యం, భూగర్భజలాలు కలుషితమయ్యే అవకాశం తగ్గుతుంది.

ఖర్చు ప్రయోజనం: ప్రస్తుతానికి, బయో ఇంధనాల ధర మార్కెట్‌లో గ్యాసోలిన్ ధరతో సమానం. అయితే వీటిని ఉపయోగించడం వల్ల మొత్తం ఖర్చు-ప్రయోజనం చాలా ఎక్కువ. అవి స్వచ్ఛ ఇంధనాలు. అంటే మండేటప్పుడు తక్కువ కర్బన, సల్ఫర్ ఉద్గారాలను విడుదల చేస్తాయి. పారిస్ ఒప్పందంలోని లక్ష్యాల అమలుకు వీటికి డిమాండ్ ఏర్పడవచ్చు. భవిష్యత్తులో ఇవి చౌకగా మారే అవకాశం ఉంది.



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్